తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
04 ఆగస్టు 2026

## ఓటర్ల డిజిటలైజేషన్‌లో నాణ్యత, పర్యవేక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

• **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 3 (జనంసాక్షి);** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో ఖచ్చితత్వంతో డిజిటలైజేషన్ పూర్తి చేసి తప్పులు లేని పారదర్శక ఓటరు జాబితా రూపొందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాదు నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, బీఎల్‌వో యాప్‌లో ప్రతి ఓటరు వివరాన్ని తప్పులు లేకుండా ఖచ్చితత్వంతో నమోదు చేయాలని ఆదేశించారు.యాప్‌లో నమోదైన వివరాలే ముసాయిదా ఓటరు జాబితాలో ప్రతిబింబిస్తాయని, ప్రతి నమోదును సూపర్వైజర్లు క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరించి, లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని సూచించారు.2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను ధృవీకరించి, సరైన మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు.ప్రతి ఓటరికి సంబంధించిన ఫోటోను సరిచూసి, ఫొటో మిస్‌మ్యాచ్‌లు లేకుండా ఖచ్చితత్వంతో నమోదు చేయాలని ఆదేశించారు. గైర్హాజరు,వలస వెళ్లిన,మృతి చెందిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా ధృవీకరించాలని ఆదేశించారు. బీఎల్‌వో,ఈఆర్‌వో స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశాలకు సంబంధించిన వివరాలను పోర్టల్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.ఓటర్ల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ చేపట్టాలన్నారు.పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణలో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా చూడాలని సూచించారు.

కలెక్టర్ కార్యాలయం లోని తన ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం మండలాల తహసిల్దార్లు, సంబంధిత అధికారులతో మాట్లాడుతూ,ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో డిజిటలైజేషన్‌ను నిర్దేశిత గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. బీఎల్‌వో యాప్‌లో ప్రతి ఓటరు వివరాలను, ఫొటోలను ఖచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు.2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాని వివరాలు,గైర్హాజరు, వలస వెళ్లిన, మృతి చెందిన ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్,ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## వరద ప్రవాహంతో జూరాలలో జోరుగా విద్యుదుత్పత్తి

• **27 గేట్ల ద్వారా శ్రీశైలానికి కొనసాగుతున్న నీటి విడుదల**



**దరూరు, ఆగస్టు 3 (జనంసాక్షి):** ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద జలాలు చేరుతుండటంతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి నిరంతరంగా కొనసాగుతోంది. జూరాల జలవిద్యుత్ కేంద్రాల్లో జెన్‌కో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. వరద ప్రవాహం పెరగడంతో జలవిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కర్ణాటక రాష్ట్రంలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులతో పాటు భీమా నది పరివాహక ప్రాంతాల నుంచి భారీగా నీటి ప్రవాహం జూరాలకు చేరుతోంది. దీంతో ప్రాజెక్టులో నీటి మట్టం నిలకడగా కొనసాగుతూ జలవిద్యుత్ ఉత్పత్తికి అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు 27 స్పిల్‌వే గేట్ల ద్వారా అధిక పరిమాణంలో నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు భద్రతా చర్యలను అధికారులు మరింత కట్టుదిట్టం చేశారు. గేట్ల నిర్వహణ, నీటి మట్టాల పర్యవేక్షణ, విద్యుదుత్పత్తి కేంద్రాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

జూరాల ప్రాజెక్టులో వరద జలాలు సమృద్ధిగా అందుతుండటంతో విద్యుదుత్పత్తి నిరంతరంగా కొనసాగడం రాష్ట్ర విద్యుత్ అవసరాల తీర్చడంలో కీలకంగా మారిందని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు ప్రాజెక్టు వద్ద వరద ప్రవాహాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

## శిశువుకు తొలి ఆహారం తల్లిపాలే

• **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 3 (జనంసాక్షి):** శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు అత్యంత విలువైన తొలి ఆహారమని, పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ద్వారా అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించే పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిశువు పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలను తప్పనిసరిగా అందించాలని సూచించారు. ముర్రుపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది వేస్తాయని తెలిపారు.

అలాగే తల్లి-శిశువు మధ్య అనుబంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి, జిల్లా మహిళా ఌ శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, ఆర్డీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 3(జనంసాక్షి):** ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 30 ఫిర్యాదు లు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా సత్వరం పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్క రించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డి.ఆర్.ఓ.రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా టూరిస్ట్ హబ్ కోసం పటిష్ట ప్రణాళిక

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ బ్యూరో, ఆగస్టు 3 (జనంసాక్షి):** మెదక్ జిల్లా ను టూరిస్ట్ హబ్ గా తీర్చిదిద్దేందుకు పటిష్టమైన ప్రణాళికలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆర్వీ కన్సల్టెంట్ ప్రతినిధులు నందన, టూరిజం డి ఈ శ్రీశైలం, ఈ డి యం సందీప్, డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు,ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు.

అంతకు ముందు ఆర్వీ కన్సల్టెంట్ ప్రతినిధులు, టూరిస్ట్ శాఖ అధికారులు మెదక్ ఖిల్లా, పోచారం అభయారణ్యం లను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఆధ్యాత్మిక, చారిత్రక, పర్యావరణ ప్రదేశాలు ఉండడం జిల్లాకు ఒక వరం అన్నారు. అధికారులు సమన్వయంతో జిల్లా టూరిస్ట్ హబ్ కోసం పాటుపడాలన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావులేదు

• **బాధితులకు సత్వర న్యాయం అందించడమే పోలీస్ శాఖ లక్ష్యం: అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**



**మెదక్ బ్యూరో, ఆగస్టు 3 (జనంసాక్షి):** ప్రజావాణిలో స్వీకరించే ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి ఒక్కో అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, కుటుంబ, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను సమర్పించారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, ప్రతి వినతిదారునికి వారి ఫిర్యాదు పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని ఆయన పేర్కొన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించడం మెదక్ జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయం, సంకోచం లేకుండా తమ సమస్యల పరిష్కారం కోసం పోలీసులను సంప్రదించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ హామీ ఇచ్చారు.




## ఆషాఢం ఆఫర్లే ఆఫర్లు

### మార్కెట్లో దుస్తులపై 50శాతం డిస్కౌంట్

### పాతస్టాక్‌ను వదిలించుకునే ప్రయత్నం!

### విక్రయాలదారులే ఆసరా డిస్కౌంట్‌లంటూ వల

### సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఇదే తంతు






# డిస్కౌంట్‌ల జాతర




**ఆషాడం వచ్చిందంటే వ్యాపారులకు పండుగ. పాత స్టాక్‌ను వదిలించేందుకు విక్రయాల దారులకు డిస్కౌంట్ ఆఫర్‌లంటూ వల వేస్తున్నారు. దీంతో ఆయా మార్కెట్‌లో డిస్కౌంట్‌పై కొనుగోలు చేసేందుకు మహిళమణులు ఆసక్తి చూపుతున్నారు. మహిళలను ప్రాధాన లక్ష్యంగా పెట్టుకొని తమ వ్యాపారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆషాడాన్ని వ్యాపారులు ఆసరాగా చేసుకుంటున్నారు. తద్వారా వారి వద్ద ఉన్న పాత స్టాక్‌కు డిస్కౌంట్ మేళా అంటూ ఆశ చూపుతున్నారు. మహిళల ఆసక్తి, ఆదరణ గమనించిన వ్యాపార సంస్థలు ఆషాడం ఆఫర్ సేల్స్ మొదలు పె ట్టాయి. చీరలతో పాటు చిన్నారుల దుస్తులపైనా కొందరు 60 శాతం వరకు డిస్కౌంట్స్ ఇస్తున్నారు. తమ బడ్జెట్లో జనవరిలో వచ్చే ఒక చీర ఆషాడంలో అయితే రెండు వస్తాయి... అంటూ మధ్య తరగతి కుటుంబాలు ఈ ఆఫర్ల దుస్తుల కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు.**

సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 03 ( జనంసాక్షి)

**ఆషాడమే లక్ష్యం**

వ్యాపారులకు ఆషాడం లాభాదాయాన్ని తెచ్చిపెడుతుందనడంలో ఆశ్చర్యం లేదు. ఆఫర్ల సందడీని విక్రయదారులకు ఆశలు చూపెడుతున్నారు. వ్యాపార సంస్థలు ఆషాడం ఆఫర్ సేల్స్ మొదలు పెట్టాయి. వాస్తవానికి రెండు దశాబ్దాల క్రితం ఈ ఆషాడం సేల్ అనే మార్కెట్ ట్రిక్కు వస్త్ర వ్యాపారులు వినియోగదారులపై వదిలారు. వారి అంచనాలకు మించి ఆఫర్ల కొను గోలుదారులు ఆఫర్ల బాట పట్టారు. వాస్తవానికి ఈ ఆఫర్లు వారి స్టాక్ ను వదిలించుకునే ప్రయత్నం.... కారణం జనవరి నుంచి వస్త్ర వ్యాసారం సీజన్ ప్రారంభం అవుతుంది. వివాహాలు, రైతు లకు పంటలు వచ్చే సమయం కావడంతో కొత్త స్టాక్లన్నింటినీ తెప్పించి ఉంచుతారు. పెళ్లిళ్ల సీజన్ పూర్తి అయ్యే సరికి 75 శాతం స్టాక్ ను అమ్ముకుంటారు. జేష్ఠ మాసం పూర్తయ్యేసరికి 25 శాతం మిగిలి ఉంటుంది. ఆషాడం అనంతరం శ్రావణమాసం ప్రారంభం అవుతుంది. ఈ సమ యంలో నూతన దంపతుల రాకపోకలు, శ్రావణ శు క్రవారం పూజలు ప్రారంభం కావడంతో మహి ళలు కొత్త మోడల్స్ వైపు ఆసక్తి చూపుతారు. దీంతో వ్యాపారస్తులు శ్రావణ మాసానికి కొత్త స్టాక్తో సిద్ధం అవుతారు. జేష్ట మాసం ఆఖరికి మిగిలి ఉన్న 25 శాతం స్టాక్ ను కంపెనీ నుంచి వచ్చిన ధరకు అమ్మేసు కునే ప్రయత్నమే ఈ ఆషాడం సే ల్). అయితే ఉన్న ఎమ్మార్పీ ధరలనే 25శాతం పెంచి దానిలో 50 శాతం డిస్కౌంట్ ఇస్తారన్న ప్రచారం ఉంది. అయితే ఈ రంగంలో 20 ఏళ్ల నుంచి వ్యాపారం చేస్తున్న కొంత మంది వ్యాపారి చెబుతూ కేవలం పాత స్టాక్ ను వదిలించుకోవ డానికే ఈ ఆఫర్లు పెడతారని తెలిపారు.

**ఆషాఢం ఆఫర్లు**

'ఆషాఢం ఆఫర్..' అంటూ ఇప్పటికే వస్త్రదుకాణాల ప్రచారం హోరెత్తుతోంది. ఈ సీజన్ అంతా దాదాపు మహిళలదే. 'ఒక చీర కొంటే ఇంకో చీర ఫ్రీ..' అంటూ దుకాణాలూ ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. గోరింటాకు, పూలు, పూజా సామగ్రి, గాజులు, అలంకరణ వస్తువుల విక్రయాలు ఈ నెలలో పెరుగుతాయి. ఆషాఢం కేవలం ఒక మాసం మాత్రమే కాదు. కుటుంబ బంధాలను మరింత దగ్గర చేసే, సంప్రదాయాలను గుర్తుచేసే, భక్తి భావం పెంపొందించే వేడుకల సమాహారం. పాత ఆచారాలను కొత్తతరం తెలుసుకునే అవకాశాన్ని కల్పించే ప్రత్యేక మాసం.

**ఆదరిస్తున్న మహిళలు**

యజమానుల పరిస్థితి అలా ఉంటే... మహి ళలకు కూడా దీని వలన ఉపయోగం జరుగుతుందనే చెప్పాలి. ముఖ్యంగా కొత్త మోడల్స్ కాకుండా ఏమైనా ధరించే సాధారణ కుటుంబాలకు చెందిన మహిళలు వీటిపై ఎక్కువ ఆర్షితుల వుతున్నారు. కారణం వారి బడ్జెట్లో జనవరిలో వచ్చే ఒక చీర ఆషాడంలో రెండు వస్తాయి. దీంతో ఆషాడం కోసమే ఎదురుచూసే మహిళలు మధ్య తరగతి కుటుంబాల్లో ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. అయితే ఇవి ఈ ఆషాడం సేల్ అన్నది చీరలకే ఎక్కువ పరిమితం. మిగిలిన వాటిపై ఆఫర్లు ఉండవు. చీరల్లో కూడా ఫ్యాన్సీ, కాటన్ చీరలపైనే ఆఫర్లు ఇస్తున్నారు. కారణం వీటి మోడల్స్ తరచూ మారిపోవడమేనని వ్యాపారులు తెలుపుతున్నారు.

**పిల్లల దుస్తులదీ అదే పరిస్థితి**

మహిళల దుస్తులతో పాటు చిన్నారుల దుస్తు లదీ కూడా అదే పరిస్థితి.. ఏడాది ఒక కొత్త మోడల్



రావడంతో పాత మోడల్స్ ఆదరణ లేక మిగిలి పోతుంటాయి. మరలా కొత్త మోడల్ వైపే పిల్లలు ఆకర్షితులు అవుతారు. దీంతో దీనిపై కూడా 60 శాతం వరకు డిస్కౌంట్స్ ఇస్తున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి తో పాటు పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, సదాశివపేట, జహీరాబాద్, జోగిపేట్, నారాయణఖేడ్ తదితర పట్టణాలలో చందనా బ్రదర్స్, ఆర్ఎస్ బ్రదర్స్ తో పాటు అనేక వస్త్ర షో రూములు వెలిశాయి. పాషాడ మాసం సందర్భంగా ఎక్కడ చూసినా షో రోములలో మహిళల సందడి నెలకొంటుంది. ఆషాడ మాసం వారం రోజులలో ముగుస్తున్నందున షో రూమ్ ల యజమానులు స్టాకును వదిలించుకోవడానికి ఆఫర్లు పెంచుతున్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచితం కావడంతో మండలాలలోని గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో పట్టణాలకు చేరుకొని వస్త్రాలు కొనుగోలు చేస్తున్నారు.

**ఆధ్యాత్మికతకు ఆషాఢం ఆలవాలం : గృహిణి**

హిందూ సంప్రదాయంలో ఆషాఢ మాసానికి ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. ఈ మాసంలో శు భకార్యాల కంటే దైవారాధన, వ్రతాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, గ్రామదేవతల జాతరలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తక్కువ ధరలతో మంచి బట్టలు వస్తుండడంతో కొంటున్నాం. అంతే పిల్లలకు కూడా ముందున్న పండుగలను దృష్టిలో ఉంచుకొని కొనాల్సి వస్తుంది.

**శుభాకార్యాల కోసం..**
**గృహిణి శిరీష్, పటాన్ చెరువు**



ఆషాడం మాసంలో వస్త్రా దుకణాల్లో ఆఫర్లు రావడం ఆనందాన్ని కలిగిస్తుంది. తక్కువ ధరలతో బట్టలు రావడంతో ఇంట్లో శు భకార్యాలకు, రోజు వారిగా తీసుకుంటున్నాం. ఎక్కువ మొత్తంలో తీసుకుంటాం. మళ్లీ మళ్లీ పండుగలకు తీసుకోవాల్సిన అవసరం ఉండదు. ఆఫర్లను బట్టి బట్టలను కొనుగోలు చేస్తాం. మాకు ఈ ఆషాడం ఆఫర్లు కొంత మేర బట్టల కొనుగోలుకు ఉపశమనం లభిస్తుంది.



**ఆషాడం సేల్ ఆఫర్ బాగానే ఉంది**
**గృహిణి, స్రవంతి, సంగారెడ్డి**

ఆషాడం సేల్ ఆఫర్ బాగానే ఉంది. మామూలు రోజుల కన్నా ధరలు తక్కువ ఉన్నట్లు అనిపిస్తుంది. ఒకటి కొంటే ఒకటి ఫ్రీ అలాగే కేజీ లెక్కన చీరలు విక్రయిస్తున్నారు. సంగారెడ్డిలో ముఖ్యమైన బట్టల షాపులలో ఆషాడం ఆఫర్లు కొనసాగుతున్నాయి. చీరలపైనే కాకుండా చిన్నపిల్లల వస్త్రాలపై కూడా ఆషాడం ఆఫర్లు ఇస్తున్నారు.

## విద్యుత్ ఎస్.ఈ అబ్దుల్ కరీం కలిసిన విద్యుత్ కాంట్రాక్టర్లు



మల్దకల్, ఆగస్టు 3 (జనంసాక్షి): జోగులాంబ గద్వాల జిల్లా నూతనవిద్యుత్ ఎస్ ఈ అబ్దుల్ కరీంని సోమవారంజిల్లా విద్యుత్తు కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాపూల బొకేతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవేంద్ర గౌడ్,ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్,ప్రధాన కార్యదర్శి చక్రధర్, సంఘం నాయకులుఆరగిద్ద రాముడు,ప్రతాపరెడ్డి, నాగేంద్రగౌడ్, గణేష్, జమ్మన్న, గోవర్ధన్, వెంకటేష్, ఆనంద్, రమేష్, సురేష్ గౌడ్, అంజిగౌడ్, మనోహర్ రెడ్డి,నాగరాజు పాల్గొన్నారు.విద్యుత్ కాంట్రాక్టు సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

## పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ



మల్దకల్, ఆగస్టు3 (జనంసాక్షి): మండల పరిధిలోనినాగర్ దొడ్డి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలకు నూతనంగా మంజూరైన ప్రహరీ గోడ కాంపౌండ్ వాల్,నిర్మాణ పనులకు సోమవారం గ్రామ పంచాయతీ పాఠశాల పరివారం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె. వెంకటేశ్వరమ్మ,ఉప సర్పంచ్ జార్జి,పాఠశాల హెడ్మాస్టర్ రాఘవేంద్ర గుప్తా, గ్రామ కార్యదర్శి సెక్రెటరీ తిరుమలేష్,మాజీ ఎంపీటీసీమహేష్,పాల్గొని పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్నామని, పనులను అత్యంత నాణ్యతతో త్వరగా పూర్తిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గ్రామ పెద్దలు జిన్ను హనుమంతు,ఎం. భీమేష్, కె.రాముడు, తిమ్మన్న, మోహన్ గౌడ్,పటేల్ బతుకమ్మ,కె. శ్రీరాముడు, శేఖర్, దేవరాజు, ఓటల్ ఏసేపు, ఫీల్డ్ అసిస్టెంట్ ఆమోసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆదర్శనగర్‌లో శోభాయమానంగా బోనాల ఉత్సవాలు



సంగారెడ్డి, ఆగస్టు 03(జనంసాక్షి): సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో గల ఆదర్శనగర్ కాలనీలో శోభాయ మానంగా అమ్మవారికి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కే. శంకర్ ఆధ్వర్యంలో కాలనీలో బోనాల పండుగ నిర్వహించడం ఇది 12వ సారి ప్రతి సంవత్సరం ఆషాఢ మాసం పురస్కరించుకొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మహిళలు బోనాలతో బయలుదేరి అమ్మవారికి సమర్పిస్తారు. బోనాల ఉత్సవాలలో కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు నర్సింగ్, చంద్రశేఖర్, రాజ్ కుమార్, తుకారం, ఆనంద్ వెంకటేశం, ఏవీ నర్సింలు, నరసింహ రాజు, మారుతి, ప్రశాంత్, మల్లారెడ్డి, ఆడివయ్యా, మహిళలు, ప్రసన్నవాణి , అంజలి, విశాల, వాణి, లక్ష్మి, రుక్మిణి, మహిళలు పాల్గొన్నారు.

# తోరణాలలో వెలుగుచూసిన రాష్ట్రకూట శైలి వీరగల్లు

- వెయ్యేళ్ల నాటి ఆత్మార్పణ శిల్పాన్ని గుర్తించిన చరిత్రకారుడు కొలిపాక శ్రీనివాస్
- శైవ వీరభక్తికి ప్రతీకగా నిలిచిన అరుదైన శిల్పకళా సంపద

నంగునూరు, ఆగస్టు 3, (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా ధూలిమిట్ట మండలం తోర్నాల (తోరణాల) గ్రామంలో రాష్ట్రకూటుల కాలం (10–11వ శతాబ్దం) నాటి అరుదైన వీరగల్లు శిల్పం వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని ఔత్సాహిక చరిత్రకారుడు కొలిపాక శ్రీనివాస్ వెల్లడించారు. గ్రామంలోని దుర్గమ్మ ఆలయానికి వెళ్లే దారిలో చెట్ల మధ్య ఈ శిల్పం ఉన్నట్లు ఆయన గుర్తించారు. కొలిపాక శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ వీరగల్లు రెండు అంతస్తులుగా చెక్కబడిన ఆత్మార్పణ శిల్పంగా విశేష ప్రాధాన్యం కలిగి ఉంది. మొదటి అంతస్తులో వీరుడు నడి నెత్తిన కొప్పు కట్టి, దానికి పొడవాటి రుమాలు బిగించి కనిపిస్తాడు. తొడల వరకు పొట్టి వస్త్రం, నడుమున నడికట్టు, ముంజేతులు, దండరెట్టలకు కడియాలు, చెవులకు పెద్ద కుండలాలు ధరించి ఉన్నాడు. కుడిచేతిలో ఎత్తి పట్టుకున్న కత్తి భుజానికి ఆనించి ఉండగా, ఎడమ చేతిలో ఫలం లేదా శివలింగంలా కనిపించే వస్తువును ధరించి ఉన్నాడు. అదే కత్తితో తన తలను తానే నరుక్కొని ఆత్మార్పణం చేసుకున్న దృశ్యాన్ని శిల్పి అత్యంత నైపుణ్యంతో మలిచాడు. శిల్పంలోని రెండవ అంతస్తులో ఇద్దరు అమరాంగనల మధ్య ఆత్మార్పణం చేసిన వీరుడు స్వర్గారోహణం చేస్తున్నట్లు చిత్రీకరించారు. ఈ శిల్ప నిర్మాణ శైలి, రూపకల్పన ఆధారంగా ఇది రాష్ట్రకూటుల కాలానికి చెందిన ఆత్మార్పణ వీరగల్లుగా గుర్తించవచ్చని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇలాంటి వీరగల్లు శిల్పాలు శైవమతంలో వీరభక్తి, ఆత్మత్యాగ సంప్రదాయాలకు నిదర్శనాలని ఆయన వివరించారు. చారిత్రక, సాంస్కృతిక, శిల్పకళా పరంగా ఈ శిల్పం ఎంతో విలువైనదని, పురావస్తు శాఖ అధికారులు దీనిపై సమగ్ర పరిశోధన చేపట్టి సంరక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



తోరణాల గ్రామంలో వెలుగుచూసిన ఈ వెయ్యేళ్ల నాటి శిల్పం తెలంగాణ చారిత్రక వారసత్వానికి మరో విలువైన ఆనవాలుగా నిలవనుందని చరిత్రాభిమానులు అభిప్రాయపడుతున్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గుపోసిన సర్పంచ్ బొల్లం శ్రీధర్



బెజ్జంకి,ఆగస్టు 3,(జనంసాక్షి): మండల కేంద్రంలోని తాడిచెట్టు సుజాత–బాలయ్య దంపతులకు ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో సోమవారం బెజ్జంకి గ్రామ సర్పంచ్ బొల్లం శ్రీధర్ (పెద్దన్న) లబ్ధిదారుల ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోసే కార్యక్రమంలో పాల్గొని ముగ్గుపోసి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీధర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతుందని సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుమాల మహేష్, వార్డు సభ్యులు లింగాల వెంకటేష్, పొట్లపెల్లి శివకృష్ణ, నాయకులు వంగల నరేష్, అయిలేని నరసింహారెడ్డి, దొంతరవేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు తొలి వరం



కల్వకుర్తి, ఆగస్టు 3 (జనంసాక్షి): శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలే తొలి వరమని, పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించాలని వైద్యాధికారి డాక్టర్ శ్యాంబాబు పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు, వ్యాధినిరోధక శక్తి సహజంగానే లభిస్తాయని తెలిపారు. అనంతరం వయస్సుకు తగిన అనుబంధ ఆహారం అందించాలని సూచించారు. తల్లిపాలు శిశువుల శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని, ప్రతి తల్లి వాటి ప్రాముఖ్యతను గుర్తించి తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలు అందించాలని కోరారు.ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రయోజనాలు, సమతుల్య పోషకాహారం, శిశు సంరక్షణపై అవగాహన కల్పించారు.

## వ్యవసాయ కూలీలకు పునరావాసం కల్పించాల్సిందే

- సిఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



న్యాల్‌కల్, ఆగస్టు 03(జనంసాక్షి): హైకోర్టు ఆదేశం, జీవో నెంబర్ 38ను వారం రోజుల్లోపు వెంటనే అమలు చేసి వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని కోరుతూ.. మండల సిఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో.. మండలంలోని ముంగి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు, కార్మికులు స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి ధర్నా నిర్వహించారు. జాతీయ ఉత్పాదక మండలి ప్రాజెక్టులో కొనసాగుతున్న పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు బాధితులకు పునరావాసం కల్పించాలని, ఇతరత్రా సౌకర్యాలను సమకూర్చాలని కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి. రామ్ చందర్ డిమాండ్ చేశారు. కూలీల హక్కులను కాల రాస్తే ఉద్యమాన్ని మరింతగా ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం శ్రేణులు సుకుమార్, రంగన్న, సంతోష్, రాజశేఖర్ రెడ్డి, వినోద, లక్ష్మీ, సంగీత, బిచ్చమ్మ, విట్టమ్మ , నిర్మల, అనిత, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

## జనసేనలోకి రైతులు చేరికలు



మక్తల్, ఆగస్టు 03 (జనంసాక్షి): మక్తల్ నియోజకవర్గంలో మొదటిసారి రైతులు స్వచ్ఛందంగా జనసేన పార్టీలో చేరారని మక్తల్ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ మణికంఠ గౌడ్ అన్నారు. మక్తల్ మండలం దాదనపల్లి గ్రామానికి చెందిన రైతులు, వీరమహిళలు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు, ఆయన చేస్తున్న సేవలు, సనాతన ధర్మ పరిరక్షణ కోసం, దేశం కోసం పని చేస్తున్న తీరును చూసి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. అన్ని పార్టీల కన్నా జనసేన పార్టీ గొప్పదని సోషల్ మీడియాలో చూశాం. మేము చదువుకోకపోయినా పార్టీ కోసం మా వంతుగా పని చేస్తాం. యువత మాత్రమే కాదు, మేము కూడా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం అని చేరిన రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మణికంఠ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో జనసేన పార్టీ రోజురోజుకూ బలపడుతోందని, యువత, విద్యావంతులతో పాటు రైతులను కూడా పెద్ద ఎత్తున పార్టీలోకి ఆహ్వానిస్తామని అన్నారు. రైతులంటే అధినేత పవన్ కళ్యాణ్ కి ఎంతో ప్రేమ అని తెలిపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ జనసైనికుల బాధ్యత అని పేర్కొంటూ మొక్కలు నాటారు. రైతుల పొలం పనులకు ఇబ్బంది కలగకుండా మునివర్ధన్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలోనే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు కె. రామన్ గౌడ్, గౌడి బాల్ రెడ్డి, శివ, కావలి ప్రవీణ్, కృష్ణ గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## 6 న రవీంద్రభారతిలో గద్దర్ సభకు హాజరుకండి

తూప్రాన్, ఆగస్టు 3(జనంసాక్షి): అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6న రవీంద్రభారతిలో జరిగే గద్దర్ మూడవ వర్ధంతి సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గద్దర్ సేన అధ్యక్షులు గజ్జల కృష్ణ తెలిపారు. గద్దర్ మూడవ సంస్మరణ సభ పోస్టర్ ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. గద్దర్ ఫౌండేషన్ తూప్రాన్ గద్దర్ సేన ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో సాయంత్రం నాలుగు గంటలకు సభ జరుగుతుందని గద్దర్ అభిమానులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గజ్జెల కృష్ణ, సంఘం ప్రధాన కార్యదర్శి మన్నె భాను, మాల మహానాడు రాష్ట్ర నాయకులు శ్యామల అశోక్, మూడో వార్డు కౌన్సిలర్ బైరం సత్తులింగం గారు, రావు, మన్నె రవి, ప్రభాకర్, ఏపుల శాయిప్రసాద్, కాలకంటి శక్తి తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కాలువ నిర్మాణంలో నాణ్యత లోపం

• ఫిర్యాదు చేసిన పట్టించుకోని పీఆర్ ఇంజనీరింగ్ అధికారి



**న్యాల్‌కల్, ఆగస్టు 03, (జనంసాక్షి) :** పల్లెల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలనే లక్ష్యంతో.. చేపట్టిన సీసీ కాలువల నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించడం, పక్షం రోజుల్లోనే బీటలు, పగుళ్లు ఏర్పడ్డాయని మండలంలోని గుంజేట్టి గ్రామానికి చెందిన పలువురు వార్డు సభ్యులు, గ్రామస్తులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.15 ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులకు నాణ్యత ప్రమాణాలను పాటించకుండా సీసీ రోడ్ల కాలువల నిర్మాణం చేపట్టిన సదరు ప్రజా ప్రతినిధి, ఇంజనీరింగ్ అధికారిపై జిల్లా ఉన్నతాధికారులు శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాధనం వృధాగా మారిందని వార్డు సభ్యులు మల్లన్న, ఇందమ్మ, గురయ్య స్వామి, మమత, శ్రీనివాస్, అధికార పార్టీ శ్రేణులు అడివప్ప, సదానంద్, సాంబశివుడు, మారుతి, వీరన్న, తదితరులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

# నిధుల మంజూరుపై హర్షం



**పాపన్నపేట, ఆగస్టు 3 (జనంసాక్షి):** మత్స్యకారుల సంక్షేమంకై రాష్ట్ర ప్రభుత్వం 2026–27 ఆర్థిక సంవత్సరానికి ఉచిత చేప పిల్లలు,రొయ్య పిల్లల పంపిణీ కోసం రూ.116 కోట్లు మంజూరు చేయడం హర్షణీయమని పాపన్నపేట మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ముశేట్టి కిష్టయ్య ముదిరాజ్ సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధుల మంజూరులో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి కృషి కీలకమని, ఈ నిర్ణయంతో రాష్ట్ర లోని లక్షలాది మంది మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడటం,మత్స్య సంపద అభివృద్ధి కి దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# బిజెపి పార్టీ ఉపాధ్యక్షుడిగా మూర్తి శంకర్



**చిన్నశంకరంపేట, ఆగస్టు 3(జనంసాక్షి):** మెదక్ జిల్లా బిజెపి పార్టీ ఓబిసి మోర్చా ఉపాధ్యక్షుడిగా చిన్నశంకరంపేట మండలం శాలిపేట గ్రామానికి చెందిన మూర్తి శంకర్‌ను జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం నియమించారు. సోమవారం మెదక్ బిజెపి పార్టీ కార్యాల యంలో జరిగిన కార్యవర్గంలో రెండవసారి నియమించినందుకు పార్టీకి తనవంతు కృషి చేస్తానని తెలిపాడు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా అధ్యక్షుడు వడ్ల జనార్ధన్‌తోపాటు మండల శాఖ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

# విలువలతో కూడిన విద్యే విద్యార్థుల విజయానికి పునాది

• బీవీఆర్ఐటీలో ఘనంగా 30వ ఇండక్షన్ డే
• ఏఐ, సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి
• కె. విష్ణు రాజు

**నర్సాపూర్, ఆగస్టు3 (జనంసాక్షి):** బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ)లో బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహించిన 30వ ఇండక్షన్ డే కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. నూతన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు కె. విష్ణు రాజు మాట్లాడుతూ, విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తూ సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. సోషల్ మీడియా, కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, సాంకేతికతను అభ్యాసానికి సహాయక సాధనంగా మాత్రమే వినియోగించాలని పేర్కొన్నారు. నకిలీ వార్తలను నమ్మడం, ప్రచారం చేయడం సమాజానికి హానికరమని హెచ్చరించారు. పట్టుదలతో బహుముఖ నైపుణ్యాలను పెంపొందించుకుని లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.

ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులతో కళాశాలలో చేరిన విద్యార్థులను అభినందిస్తూ ప్రోత్సాహకంగా ఉత్తమ పుస్తకాలను అందజేశారు. ఫ్రెష్‌మెన్ల కోసం రూపొందించిన నూతన పుస్తకాలను ఆవిష్కరించారు.శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ, సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. తరగతి గదిలో నేర్చుకున్న విజ్ఞానాన్ని ప్రాజెక్టులు, పరిశ్రమల అనుభవంతో అనుసంధానం చేసుకోవడంతో పాటు పూర్వ విద్యార్థులు, పరిశ్రమలతో వృత్తిపరమైన సంబంధాలను పెంపొందించుకోవాలని అన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే మాట్లాడుతూ, ప్లేస్‌మెంట్లు, ఉన్నత విద్య, పరిశోధన, వ్యవస్థాపకత, సామాజిక బాధ్యత వంటి రంగాల్లో బీవీఆర్ఐటీ విశిష్ట




గుర్తింపు సాధించిందన్నారు. ఈ-బాజా (e-BAJA SAEINDIA) వంటి జాతీయ స్థాయి పోటీల నిర్వహణతో పాటు ఇటీవల జటాయువు జాతీయ స్థాయి పోటీలో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు విజయం సాధించడం కళాశాల ప్రతిష్టను మరింత పెంచిందన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు.కళాశాల డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం రూపొందించిన ఏడు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమం ద్వారా విద్యతో పాటు విలువలు, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల విద్యా ప్రగతిని తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రోత్సహించాలని సూచించారు. సీనియర్ విద్యార్థులు నూతన విద్యార్థులకు స్వాగతం పలికి కళాశాలలోని క్లబ్బులు, ప్రొఫెషనల్ సొసైటీల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. పూర్వ విద్యార్థులు సాత్విక్, విజయ్ తమ అనుభవాలను పంచుకుని విద్యార్థులను ప్రేరేపించారు. ప్రథమ సంవత్సరం విభాగాధిపతి డా.బి.మృణాళిని శశాంక కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు, డీన్లు, అధ్యాపకులు, బోధ న, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ కాంతారావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ బి. బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ తదితరులు హాజరయ్యారు.

# బాధిత కుటుంబానికి బుద్ధుల ఆర్థికసాయం



**శివ్వంపేట, జూలై 3 (జనంసాక్షి):** శివ్వంపేట మండలం దొంతి గ్రామంలో ఇటీవల మృతిచెందిన చెన్నగారి పోచమ్మ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ వార్డు సభ్యులు బుద్ధుల మమత భిక్షపతి సోమవారం రూ. 6వేల ఆర్థికసాయం అందజేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల లో వార్డు సభ్యునిగా గెలిపిస్తే తమవంతు ఆర్థికసాయం చేస్తామని చెప్పిన హామీ మేరకు రూ. 6వేల అందజేయడం జరుగుతుందని బుద్ధుల తెలిపారు. అదేవిధంగా మరో వార్డు సభ్యులు పిట్ల కృష్ణ సైతం బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు లాయక్, సుకుమార్, తదితరులు ఉన్నారు.

# అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని ఫిర్యాదు




**రాజాపూర్, ఆగస్టు 3 (జనంసాక్షి):** మండల కేంద్రంలో గల దుందుభి వాగునుండి ఇసుకను టిప్పర్లలో, ట్రాక్టర్లలో అక్రమంగా రవాణా చేయడంతో, రాజాపూర్ గ్రామంలో రోడ్లు గుంతలుగా ఏర్పడుతుందని, రాత్రి వేళల్లో ట్రాక్టర్ల శబ్దానికి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇండ్ల ప్రజలు నిద్రపోలేని పరిస్థితి నెల కొంది అని, సర్పంచ్ రామాకృష్ణ వెంటనే ఈ ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు.

# విశ్వశాంతి మహాయాగంలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి.. ప్రజల సంక్షేమమే తన ఆకాంక్ష

• ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్ష



**కల్వకుర్తి,ఆగస్టు 3,(జనంసాక్షి):** కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్‌లో శ్రీకృష్ణ కాలచక్రం 91వ విశ్వశాంతి మహాయాగం మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతోంది. ఈ మహాయాగంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామీజీ ఆశీర్వాదాలు స్వీకరించి రాష్ట్ర ప్రజల శాంతి, సౌభాగ్యం కోసం ప్రార్థించారు.

ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో శాంతి, సామరస్యం నెలకొని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమాజంలో మానవీయ విలువలు మరింత



బలపడాలని, పరస్పర ప్రేమాభిమానాలు, ఐక్యతా భావంతో ప్రజలు ముందుకు సాగితేనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

విశ్వశాంతి కోసం నిర్వహిస్తున్న ఇలాంటి మహాయాగాలు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు దేశం, రాష్ట్రం, సమాజ శ్రేయస్సుకు దోహదపడతాయని పేర్కొన్నారు. భక్తి, ఆధ్యాత్మికత మనిషికి మానసిక ప్రశాంతతను అందించి సమాజంలో సానుకూల మార్పులకు మార్గం చూపుతాయని చెప్పారు.

మహాయాగం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగ వేదిక ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా, రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుభిక్షం, సస్యశ్యామలత కలగాలని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆకాంక్షించారు.

# కామ్రేడ్ సైదులు తల్లి కేసుమల్ల లక్ష్మమ్మకు సీపీఎం నేతల నివాళి

**ఉప్పునుంతల, (జనంసాక్షి):** ఉప్పునుంతల మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు కామ్రేడ్ సైదులు తల్లి కేసుమల్ల లక్ష్మమ్మ అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె భౌతికకాయానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వి. పర్వతాలు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దేశ్ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు శంకర్ నాయక్, మల్లేష్, పార్టీ నాయకులు గుండె మల్లేష్, రాములు తదితరులు పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, లక్ష్మమ్మ మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## చేర్యాలలో నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదం

• రెండు వాహనాలు ఢీ ఇద్దరికి తీవ్రగాయాలు



**చేర్యాల, ఆగస్టు 03 (జనంసాక్షి):** చేర్యాల పట్టణంలోని నేషనల్ హైవే పై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో బైక్, ఎక్సెల్ వాహనాలు ఢీకొన్నాయి. స్థానికుల వివరాల ప్రకారం ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలవ్వగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంలో గాయపడిన వారు ఒకరు తొగుట మండలానికి చెందిన యాదగిరి, మరొకరు చేర్యాల వాసిగా గుర్తించారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

• చేర్యాల డివిజన్ అధికారి రాధిక



**చేర్యాల, ఆగస్టు03(జనంసాక్షి):** ఫర్టిలైజర్ సేల్ యాప్ ద్వారానే ఎరువులు విక్రయించనున్నట్లు ఏడీఏ రాధిక తెలిపారు. 5వ తేదీలోగా ఈ – పోస్ లో డీఏపీ, కాంప్లెక్స్, ఎన్పీకే, పొటాష్ భౌతిక నిల్వలను సరిచూసి అప్డేట్ చేయాలని ఎరువుల దుకాణదారులను ఆదేశించారు. రైతులు కచ్చితంగా 'ఫార్మర్ రిజిస్ట్రేషన్' చేసుకోవాలని, లేకపోతే ఎరువులు బుక్ చేసుకోవడం సాధ్యపడదని స్పష్టం చేశారు. ఈ నూతన విధానంలో యూరియా విక్రయాలకు వర్తించదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, షాప్ యజమానులు, రైతులు పాల్గొన్నారు.

## జడ్పీహెచ్ఎస్‌లో బాలికలకు హెచ్‌పీవీ టీకాలు



**కొత్తపల్లి, ఆగస్టు 3 (జనంసాక్షి):** కొత్తపల్లి మండలం నిడిజింత గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం 14 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల 16 మంది బాలికలకు గర్భాశయ ముఖ ద్వార (సర్వైకల్) క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జి. హెచ్. ఆంజనేయులు మాట్లాడుతూ, బాలికలు ఆరోగ్యంగా ఉండేందుకు మరియు భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడకుండా నివారించేందుకు ప్రభుత్వం ఈ టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రజిత శ్రీనివాస్ రెడ్డి, ఏఎన్ఎం సావిత్రమ్మ, ఆశా వర్కర్లు మంజుల, భాగ్యమ్మ, మైముదా, పాఠశాల ఉపాధ్యాయులు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్యకర ఐశ్వర్యం



**రాజాపూర్, ఆగస్టు 3 (జనంసాక్షి):** మండల పరిధిలోని రంగారెడ్డిగూడ గ్రామంలో లక్ష్మీ నారాయణ దేవాలయం ప్రాంగణంలో మహిళలు గోరింటాకు లక్ష్మీపూజ నిర్వహించారు. అనంతరం చేతులకు గోరింటాకు పెట్టుకోవడం జరిగింది. మహిళలు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వెనుక ఆధ్యాత్మిక, సాంప్రదాయ, ఆరోగ్యపరమైన కారణాలు ఉన్నాయని, గోరింటాకును లక్ష్మీదేవికి ప్రీతికరమైనదిగా భావిస్తారు. అందుకే ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకుని శుభం, ఐశ్వర్యం కోరుకుంటారు. ఆషాఢం సాధారణంగా వర్షాకాలం ప్రారంభం అవుతుందని, గోరింటాకు శరీరాన్ని చల్లబరిచే గుణం ఉండటంతో చేతులు, కాళ్లలో వేడిని తగ్గించడంలో సహాయపడుతుందని ఆయుర్వేదంలో చెబుతారని, ఈ నెలలో వచ్చే పండుగలు, వ్రతాలు, మంగళకార్యాల సందర్భంగా గోరింటాకు పెట్టుకోవడం చాలా ప్రాంతాల్లో ఆనవాయితని అన్నారు.

# సమస్యల పరిష్కారమే అజెండాగా సాగిన సర్వసభ్య సమావేశం

• ప్రత్యేక అధికారి రఘునాథ్ రెడ్డి అధ్యక్షతన సాగిన సమావేశం
• ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులకు సూచన



**చిన్నంబావి, ఆగస్టు 3 (జనంసాక్షి):** చిన్నంబావి మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి రఘునాథ్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై అధికారులు, సర్పంచులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా, సకాలంలో అందేలా అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ గృహాల నిర్మాణం, ఉపాధిహామీ పనులు, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, రహదారులు, విద్యుత్, డ్రైనేజీ, ఆరోగ్య సేవలు, రేషన్ పంపిణీ, గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు తదితర అంశాలపై అధికారులు, సర్పంచుల మధ్య సుదీర్ఘంగా చర్చ జరిగింది. గ్రామాల వారీగా ఎదురవుతున్న సమస్యలను సర్పంచులు ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖల అధికారులు వాటిపై వివరణ ఇచ్చి, పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నాణ్యతతో పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ప్రత్యేక అధికారి రఘునాథ్‌రెడ్డి సూచించారు. ప్రజాప్రతినిధులు సూచించిన సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఆదర్శ్ గౌడ్, ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపీవో రామస్వామి, మండలంలోని సర్పంచులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పిల్లలకు హెచ్.పి.వి.వ్యాక్సినేషన్




**మల్దకల్, ఆగస్టు 3 (జనంసాక్షి):** మండలంలోని 9 ఆరోగ్య ఉప కేంద్రాలలో సోమవారం14 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల వరకు బాలికలందరికి హెచ్ పివి టీకాలు వేయడం ద్వార భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండ రక్షించవచ్చని డాక్టర్ ఉష అన్నారు.మెడికల్ ఆఫీసర్ఉష ఆధ్వర్యంలో హెచ్ పివి టీకాకరణను వేగవంతంగ చేపట్టామని, అర్హులైన 180 బాలికలకు హెచ్ పి వి టీకాలు వేయడం జరిగింది.మిగిలిన వారందరికి నిర్ణీత గడువులోగ టీకాలు పూర్తి చేసేల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని మెడికల్ ఆఫీసర్ తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్సి సిబ్బంది,ఎంఎల్ హెచ్ పి,సబ్ సెంటర్ సిబ్బంది. పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

• రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**వెల్దండ, ఆగస్టు 03 (జనంసాక్షి):** వెల్దండ మండలం రాఘయిపల్లి గ్రామానికి చెందిన కోనేటి లక్ష్మమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు.కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో వెల్దండ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మాజీ ఎంపీపీ పుట్టరామ్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్,మాజీ ఎంపిటిసి నిరంజన్,ఉప సర్పంచ్ కొండల్ యాదవ్,వెంకటయ్య,మెండే శ్రీను,అంజి మాస్టర్,గణేష్,అశోక్, పాపా,గిరి,మల్లేష్, సుదర్శన్, సురేష్,నర్సింహా,తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో బలి.. మూడు గొర్రె పొట్టేళ్లు మృతి..

• బాధితుడికి 80వేల నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తుల డిమాండ్



**గండీడ్, ఆగస్టు 03 (జనంసాక్షి):** గండీడ్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ షాక్ కారణంగా మూడు గొర్రె పొట్టేళ్లు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఈఘటనలో రైతు బొక్కి భీమయ్యకు సుమారు రూ.80 వేల మేర ఆర్థిక నష్టం వాటిల్లినట్లు సమాచారం.గ్రామానికి చెందిన రైతు బొక్కిభీమయ్య,తన గొర్రెలను మేపుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేస్తున్న మూడు గొర్రె పొట్టేళ్లు ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి.
ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లో విద్యుత్ ప్రమాదానికి కారణమై ఉండొచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.
ఒక్కసారిగా మూడు పొట్టేళ్లు మృతి చెందడంతో రైతు భీమయ్య,తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాడు.విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఘటనాస్థలికి చేరుకుని బాధిత రైతును పరామర్శించారు.విద్యుత్ శాఖ అధికారులు వెంటనే ఘటనపై విచారణ చేపట్టి ప్రమాదానికి గల కారణాలను వెలుగులోకి తీసుకురావాలని,ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని గ్రామస్తులు కోరారు.అలాగే ప్రభుత్వం,విద్యుత్ శాఖ అధికారులు స్పందించి బాధిత రైతుకు తక్షణమే రూ.80వేల నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## స.హ చట్టం బలోపేతానికి ఐక్యమవుదాం

• నేషనల్ ఆర్.టి.ఐ ఆక్టివిస్ట్ ఫోరం చైర్మన్ బాబుల్ రెడ్డి



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 3 (జనంసాక్షి):** అవినీతి అంతానికి పదునైన ఆయుధం స.హచట్టమని దానిని మరింత బలోపేతంగా తయారు చేయడానికి ఉద్యమకారులు నడుం బిగించి ఐక్యతగా పోరాడాలని స్థానిక ఒక ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో నేషనల్ ఆర్.టి.ఐ ఆక్టివిస్ట్ ఫోరం చైర్మన్ బాబుల్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స.హ చట్ట పరిరక్షణకై నడుస్తున్న సమాచార హక్కు చట్ట పరిరక్షణ వేదికలను జాతీయంగా విస్తృతపరుస్తున్నామని త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణ ఏర్పాటు చేసి సహ ఉద్యమకారుల సభ్యత్వాలను మెరుగుపరుస్తూ, జిల్లాల వారీగా కమిటీ మెంబర్లను ఏర్పాటు చేస్తూ, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సెక్షన్ 4(1b)ఖచ్చితంగా అమలు అయ్యే విధంగా, ప్రభుత్వపరంగా ప్రతి జిల్లాకు ఇద్దరు కమిటీ మెంబర్లను ఏర్పాటు చేసే విధంగా పోరాటం కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.టి.ఐ ఉద్యమకారులు నరసింహులు, వావిలాల రాజశేఖర్ శర్మ, ఉట్కూరు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10 జైల్ బరో విజయవంతం చేద్దాం



**మాగనూర్, (జనంసాక్షి):** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం. ప్రజా,కార్మిక ,రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జైల్ బరో కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లా కేంద్రంలో కూడా విజయవంతం చేద్దామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పుంజనూరు ఆంజనేయులు సిఐటియు జిల్లా అధ్యక్షులు సి ఆర్ గోవింద్ రాజ్ సిఐటియు జిల్లా నాయకులు భరత్ కుమార్ తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటయ్య పిలుపునిచ్చారు. సోమవారం రోజు మాగనూరు మండల కేంద్రంలో భగత్ సింగ్ చౌరస్తాలో కరపత్రం రిలీజ్ చేశారు. మాగనూరు మండల కేంద్రంలో వారు ప్రసంగించారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూల విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. ఎందరో పోరాట యోధుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న దేశ స్వాతంత్రాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతున్నారు మన ప్రధాని మోడీ అని అన్నారు.

అందుకే నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో నేడు కార్పొరేట్ పెట్టుబడుదాలకు మతోన్మాదులకు వ్యతిరేకం గా కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు ప్రజలు ప్రజాతంత్ర వాదులు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.


కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక ,రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ గ్రామ గ్రామాన సభలు, సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టం రూపొందింది దీని ప్రకారం వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో 100 రోజులు పని కల్పించాలి అయితే ఈ చట్టాన్ని వి బి జి రాంజీ గా మార్పు చేయడమే కాక రాష్ట్రాల వాటా 40 శాతం నిధులు భరించాలని నిర్ణయించడం. ఈ పథకమును నేరుగా అర్చన తప్ప మరోటి కాదని మండిపడ్డారు అంతోదయ కార్డు ద్వారా నిరుపేదలకు అందిస్తున్న బియ్యం కోట తగ్గించడం దారణమన్నారు.

నాలుగు లేబర్ కోడ్ ల వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని, కార్మికులను యజమాని ముందు బానిసలా నిలబెట్టే కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు . కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశభక్తి ముసుగులో దేశాన్ని మొత్తం ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు ధార దత్తం చేస్తుందని, స్వదేశీ ముసుగులో విదేశీ అమెరికన్ బ్రిటన్ యూనియన్ న్యూజిలాండ్, లాంటి దేశాలతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు అశోక్, సిఐటియు నాయకులు ఎస్. ఆంజనేయులు, నరసింహ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# జనంసాక్షి కథనానికి స్పందన

- కొత్త రైస్ మిల్లులో విజిలెన్స్ ఆకస్మిక తనిఖీలు
- ధాన్యం నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, సీఎంఆర్ లెక్కల పరిశీలన
- అక్రమాలు ఉంటే కఠిన చర్యలు




రూ.కోట్ల విలువైన ధాన్యం గల్లంతు

**మెదక్ బ్యూరో, ఆగస్టు 3(జనంసాక్షి):** జనంసాక్షి దినపత్రికలో ప్రచురితమైన "రూ. కోట్ల విలువైన ధాన్యం గల్లంతు" కథనానికి స్పందించిన విజిలెన్స్ అధికారులు మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం శివారులో ఉన్న కొత్త రైస్ మిల్లులో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

విజిలెన్స్ అధికారుల బృందం మిల్లులో నిల్వ ఉంచిన ధాన్యం బస్తులను భౌతికంగా పరిశీలించి, స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు వివరాలు, సీఎంఆర్ బియ్యం లెక్కలు, గోదాముల్లో ఉన్న నిల్వలను రికార్డులతో సరిపోల్చి పరిశీలించింది. ధాన్యం నిల్వలను లెక్కిస్తూ అవసరమైన వివరాలను నమోదు చేసింది. ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రైస్ మిల్లుల్లో అక్రమాలు వెలుగుచూసిన నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో మెదక్ జిల్లాలో కూడా మిల్లులపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ప్రభుత్వ ధాన్యం నిల్వలు, సీఎంఆర్ బియ్యం సరఫరా, స్టాక్ నిర్వహణలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా విజిలెన్స్ అధికారులు నిరంతర తనిఖీలు చేపడుతున్నారు.

తనిఖీల సందర్భంగా మిల్లు యాజమాన్యం నుంచి అవసరమైన రికార్డులు, పత్రాలను అధికారులు పరిశీలించినట్లు తెలిసింది.

తనిఖీల నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు సమాచారం. ఒకవేళ రికార్డులకు, వాస్తవ నిల్వలకు మధ్య వ్యత్యాసాలు గుర్తిస్తే సంబంధిత రైస్ మిల్లు యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశముంది. జిల్లాలోని ఇతర రైస్ మిల్లుల్లో కూడా ఇదే తరహా ఆకస్మిక తనిఖీలు కొనసాగనున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి.

# ఆటకెక్కిన మట్టి డబ్బుల పంచాది

- గ్రామసభలో మాజీ సర్పంచ్‌ను నిలదీసిన గ్రామస్థులు




**శివ్వంపేట ఆగస్టు 3 (జనంసాక్షి):** దిగమింగిన మట్టి డబ్బులు కచ్చితంగా ఇవ్వాల్సిందేనని గ్రామ సభ ముక్తకంఠంగా గ్రామస్తులు డిమాండ్ చేశారు. శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ దొంతి రెడ్డి అరుణ రెడ్డి అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామసభలో పలు అంశాలపై గ్రామస్తుల సమక్షంలో చర్చించారు. ఈ సందర్భంలో గ్రామ శివారులోని దేవుని చెరువు లో మూడు సంవత్సరాల క్రితం 11 లక్షల రూపాయలకు చెరువు మట్టిని అప్పటి గ్రామ పంచాయతీ పాలకవర్గం మట్టి వ్యాపారులకు విక్రయించారు. అయితే ఆ డబ్బులను ఇతర ప్రదేశంలో అభివృద్ధి పనులకు వినియోగించనని మాజీ సర్పంచ్ ఏనుగు సుధాకర్ రెడ్డి చెప్పడంతో గ్రామసభ నిర్వహించకుండా, ఎటువంటి తీర్మానం చేయకుండా అండర్ పైప్ లైన్ పనులు ఏలా చేశారని, మట్టి డబ్బులు 11 లక్షలనీ వద్ద భద్రంగా ఉంచితే ఆ డబ్బులను ఎవరినీ అడగకుండా ఎలా ఖర్చు చేశారని గ్రామస్తులు ప్రశ్నించారు. మహంకాళి అమ్మవారి దేవాలయం నిర్మాణానికి ఆ డబ్బులను ఉపయోగిద్దామని సుధాకర్ రెడ్డి గ్రామస్తులను నమ్మించి, ఇప్పుడు గ్రామస్తులు ఆ మట్టి డబ్బులు అడిగితే, సరైన సమాధానం చెప్పకుండా, నా సొంతానికి వాడుకోలేదని పైప్‌లైన్ పనులకు వాడానని చెప్పడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు వాపోయారు. దిగమింగిన డబ్బులను అతడి నుంచి కచ్చితంగా రికవరీ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మట్టి డబ్బులను ఆటకెక్కించడం అత్యంత దుర్మార్గకరమని వారు అన్నారు. మట్టి డబ్బులు ఇవ్వని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమానికి శ్రీకారం చుడతామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ గ్రామసభలో సర్పంచ్ దొంతి రెడ్డి అరుణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బలరాం రెడ్డి, ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు దొంతి రెడ్డి రాం చంద్రారెడ్డి, రామారం నర్సింలు, నరేష్, అశోక్, చేకూరి వెంకటేష్ గౌడ్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నర్మెటలో ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం



**నంగునూరు, ఆగస్టు 3(జనంసాక్షి):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో సర్పంచ్ శనిగరం స్వాతి బాబు అధ్యక్షతన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో గర్భిణీ దశ నుండి రెండు సంవత్సరములకు గల వెయ్యి రోజుల ప్రాముఖ్యత గురించి చెప్పడం జరిగింది బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు కేవలం 6 నెలల వరకు తల్లిపాలు తాగించడం ఎలాంటి ఇతర పానీయాలు ఇవ్వకూడదని అంశంపై మరియు ఆరు నెలల నిండిన తర్వాత అనుబంధ ఆహారము మొదలుపెట్టి రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు కొనసాగించాలి అనే అవగాహన కల్పించడం జరిగింది. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతలపై కూడా అవగాహన కల్పించాము మరియు బిడ్డను ప్రతినెల హైట్ వెయిట్ తీసుకోవాలి అని పలు అంశాలపై అవగాహన కల్పించాము 6నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి సర్పంచ్ స్వాతి బాబు , ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, వార్డు సభ్యులు ఆకుల భారతి గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్ గారు, బాలల సంరక్షణ అధికారి రమేష్, డాక్టర్ శివకిషోర్ హెల్త్ అసిస్టెంట్ లింగం ఏఎన??ఎం ,అంగన్వాడీ టీచర్స్ విజయ, ఉత్తర, తల్లులు గ్రామ పెద్దలు మరియు వివో ఏ మౌనిక లు హాజరయ్యారు.

# ఎంపీపీఎస్ ఆయా ఉద్యోగ ఎంపికలో అన్యాయం జరిగిందంటూ ప్రజావాణిలో ఫిర్యాదు



**బెజ్జంకి,ఆగస్టు 3,(జనంసాక్షి):** మండలంలోని పెరుకబండ గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఆయా ఉద్యోగం ఎంపికలో నిబంధనలు పాటించకుండా అన్యాయం చేశారని ఆరోపిస్తూ కొంపల్లి అంజలి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఆయా ఉద్యోగానికి తాను దరఖాస్తు చేసుకోగా,నిబంధనల ప్రకారం 7వ తరగతి విద్యార్హతను ప్రామాణికంగా తీసుకోకుండా,తాను సమర్పించిన 7వ తరగతి మార్కుల మెమోను పరిగణనలోకి తీసుకోకుండా 10వ తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక చేశారని ఆరోపించారు.ఈ విషయంపై ఎంపీఓను వివరణ కోరగా పొరపాటు జరిగిందని,సరిచేస్తామని చెప్పి తిరిగి అదే వ్యక్తిని ఎంపిక చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించినట్లు అంజలి తెలిపారు.

# శాఖాపూర్ గ్రామానికి వెంటనే రోడ్డు వేయాలి

- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన
- శాశ్వత రహదారి నిర్మించాలని డిమాండ్
- సమస్య పరిష్కారం వరకు పోరాటం కొనసాగుతుందని బీఎస్పీ హెచ్చరిక



**నారాయణఖేడ్, ఆగస్టు 03(జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మండలం శాఖాపూర్ గ్రామానికి వెంటనే శాశ్వత రహదారి నిర్మించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులతో కలిసి బీఎస్పీ నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు అనుముల తుకారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాఖాపూర్ గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిని బురదమయంగా మారడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ద్విచక్ర వాహనాలు, అత్యవసర సేవల వాహనాలు సైతం రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

వెంటనే నాణ్యమైన శాశ్వత రహదారి నిర్మాణ పనులు చేపట్టి గ్రామ ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో శాఖాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఓబీసీ సంక్షేమమే బీజేపీ లక్ష్యం: గడ్డం కాశీనాథ్



**మెదక్ టౌన్ ఆగష్టు 03, (జనంసాక్షి):** మెదక్ జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం కాశీనాథ్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఓబీసీ వర్గాల సంక్షేమం, సామాజిక న్యాయం మరియు రాజకీయ ప్రాతినిధ్యానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. మహనీయుడు మహాత్మా జ్యోతిరావు (జ్యోతిబా పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఓబీసీ వర్గాల సాధికారత, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాల కల్పనలో బీజేపీ కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా వివరించాలని సూచించారు.

## కొత్త రాజోలిలోనే ఎమ్మార్వో కార్యాలయం నిర్మించాలి

- **రూ.2.25 కోట్ల నిధులతో భవనం ఏర్పాటుకు కలెక్టర్‌కు వినతి**



**రాజోలి, ఆగష్టు 7(జనంసాక్షి):** కొత్త రాజోలి మండల కేంద్రంలోనే రూ.2.25 కోట్ల వ్యయంతో కొత్త ఎమ్మార్వో కార్యాలయ భవనాన్ని నిర్మించాలని కోరుతూ కొత్త రాజోలి అఖిలపక్ష కమిటీ సభ్యులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కు వినతిపత్రం అందజేశారు.

**వరద ముంపు లేని ప్రాంతం కావాలి...**

ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి ఏటా వరదలకు గురవుతున్న ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఉండడం వల్ల ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వరద ముంపు లేని కొత్త రాజోలి గ్రామంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయని, అక్కడే ఎమ్మార్వో కార్యాలయాన్ని నిర్మిస్తే ప్రజలకు, రెవెన్యూ సిబ్బందికి సౌకర్యంగా ఉంటుందని వివరించారు.

**కలెక్టర్ సానుకూల హామీ...**

వినతిపత్రాన్ని పరిశీలించిన కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ప్రజల అవసరాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకుంటామని అన్నారు. "సంబంధిత ఎమ్మార్వో తో ప్రభుత్వ భూములను సర్వే చేయించి, అన్ని వసతులు ఉన్న తగిన స్థలాన్ని పరిశీలించి త్వరలో నిర్ణయం తీసుకుంటాము" అని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్దకల్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు




**మల్దకల్, ఆగష్టు 3 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని పి యం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారంనూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలకు 216 మంది నూతన విద్యార్థులు ప్రవేశం పొందగా మొత్తం విద్యార్థుల నమోదు 726కు చేరుకుంది.ప్రైవేట్ పాఠశాలల నుంచి దాదాపు 60 అడ్మిషన్స్ రావటం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు నూతనంగా చేరిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి ఆత్మీయంగా స్వాగతం పలికారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూపీ యం శ్రీ పథకం ద్వారా నాణ్యమైన విద్య,డిజిటల్ తరగతులు, ఆధునిక మౌలిక సదుపాయాలు, క్రీడలు, సాంస్కృతిక, కార్యక్రమాలతో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి సురేష్,ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయండి..

- **పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**



**పటాన్చెరు ఆగస్టు 3(జనంసాక్షి):** పటాన్చెరు, గుమ్మడిదల మండల పరిధిలోగల గ్రామాలలో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సోమవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పటాన్చెరు, గుమ్మడిదల మండలాల పరిధిలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, పిఆర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులతో పాటు సిఎస్ఆర్ నిధులు కేటాయిస్తామని తెలిపారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో పరిష్కారానికి నోచుకోని సమస్యలను తన దృష్టికి తీసుకొని వస్తే.. పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నందిగామ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తే రాబోయే పది రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. దీని ద్వారా ప్రతినెల గ్రామపంచాయతీకి ఆదాయం లభిస్తుందని తెలిపారు. భానూరు, క్యాసారం, నందిగామ గ్రామపంచాయతీల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని ఆదేశించారు.

గుమ్మడిదల మండల పరిధిలోని అనంతరం, కానుకుంట, నూతనకల్, కొత్తపల్లి, తదితర గ్రామాల పరిధిలో అంతర్గత రహదారుల నిర్మాణానికి హ్యామ్ ద్వారా నిధులు మంజూరయ్యాయని.. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు డిఈ దీపక్ తెలిపారు. టెండర్లు పూర్తి చేసిన పనులు ప్రారంభించక పోతే.. సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు యాదగిరి, ఉమాదేవి, పిఆర్ డిఈ దీపక్, ఎంపీఓ హరిశంకర్ గౌడ్, ఏఈ శశిధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పబ్లిక్ స్కూల్‌ను తరలించి విద్యార్థులను ఇబ్బందులు పెట్టొద్దు

- **వెల్దుర్తి పట్టణంలోని పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి**
- **పాఠశాల, కళాశాలను బందు పాటించిన గ్రామస్తులు, విద్యార్థులు తల్లిదండ్రులు**
- **ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన స్కూల్ చైర్మన్**





**వెల్దుర్తి, ఆగస్టు 3(జనంసాక్షి):** మండల కేంద్రమైన వెల్దుర్తికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను కుకునూర్ గ్రామానికి తరలించి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయవద్దని గ్రామస్తులు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన వెల్దుర్తి గ్రామస్తులు నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను వెల్దుర్తిలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ పాఠశాలను, కళాశాలను స్వచ్ఛందంగా మూసివేసి బందును పాటించారు అలాగే వెల్దుర్తి నుండి మరో ప్రాంతానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ని తరలించవద్దని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కుమ్మరి మాధురి ముకుందం మెదక్ కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్కు వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్దుర్తి నుండి కుకునూర్ కు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను తరలించేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడవద్దని ప్రభుత్వం అధికారులు స్పందించి తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను తరలించకుండా వెల్దుర్తి లోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. లేనియెడల రిలే నిరాహార దీక్షలు చేపడతామని ఆందోళనలు ఉధృతం చేస్తామని వారన్నారు ఈ కార్యక్రమంలో కోదండశేఖర్ గౌడ్ చందు నవీన్ శేఖర్ సదాశివ గౌడ్ అనిల్ తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ట్రస్ట్ పేరిట ఆక్రమణలు

- **ప్రజావాణిలో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం ఇచ్చిన హవెల్లఘన్పూర్ గ్రామస్తులు**

**మెదక్ బ్యూరో, ఆగస్టు 3 (జనంసాక్షి):**

ప్రభుత్వ భూమి ఆక్రమణపై గ్రామస్తుల ఆందోళన హెచ్ ఐ ఎస్ ఆరో దర్శన్ ట్రస్ట్‌పై విచారణకు జిల్లా కలెక్టర్‌కు మెదక్ జిల్లా హవెలి ఘనపూర్ మండలం పోచారం గ్రామ ప్రజలకు వినతి పత్రం ఇచ్చారు. గ్రామ అవసరాల కోసం ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని హవేళీఘణాపూర్ మండలం పోచం రాల్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తుల వివరాల ప్రకారం, మిరుగుడుపల్లి గ్రామ శివారులో సుమారు 16 ఎకరాలు, సర్జన రెవెన్యూ గ్రామ శివారులో సర్వే నంబర్ 807లో సుమారు 8-9 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. గతంలో ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం పర్యాటక ప్రాంతంగా గుర్తించడంతో పాటు పోచారం డ్యాం ముంపు ప్రాంతంగా కూడా ప్రకటించిందని తెలిపారు. ప్రస్తుతం ఈ భూమిని రైతులు పంట కోత సమయంలో ధాన్యం ఆరబెట్టేందుకు, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంగా, గ్రామ పశువులు అటవీ జంతువుల మేత కోసం వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. అయితే ఇటీవల ఎ×ూ ఆరో దర్శన్ ట్రస్ట్, హైదరాబాద్ పేరుతో ఈ ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై గతంలో తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, 2022 సెప్టెంబర్ 20న అధికారులు స్థలాన్ని పరిశీలించి భూమి ప్రభుత్వ భూమి అని నిర్ధారించి ఫెన్సింగ్ పనులను నిలిపివేశారని గుర్తు చేశారు. అయినప్పటికీ మళ్లీ ఆక్రమణ ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ప్రభుత్వ భూమిపై జరుగుతున్న ఆక్రమణను వెంటనే అడ్డుకుని, సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే ఆ భూమిని పోచమ్మరాల్ గ్రామ ప్రజల అవసరాల కోసం శాశ్వతంగా కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను గ్రామస్తులు కోరారు.

# వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు పర్యటన

- వర్షాల బాధిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన - అభివృద్ధి పనులకు వేగం
- రాయన్‌పల్లి నుంచి దూప్‌సింగ్ తండా వరకు అభివృద్ధి పనుల పరిశీలన
- బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా వెంటనే చర్యలు అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు
- రాయన్‌పల్లి వంతెనకు రూ.2.30 కోట్లు - అత్యవసర మరమ్మతులకు రూ.15 లక్షలు



**మెదక్ మండలం, ఆగస్టు 3(జనంసాక్షి):** మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ఆదివారం వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, గ్రామీణ రవాణా మార్గాలను సందర్శించి అధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. ఎక్కడా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

ముందుగా మెదక్ మండలంలోని రాయన్‌పల్లి వంతెన వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వంతెన దెబ్బతిన్న పరిస్థితిని పరిశీలించారు. ఈ వంతెనకు శాశ్వత పరిష్కారంగా పూర్తిస్థాయి పునర్నిర్మాణం కోసం సుమారు రూ.2.30 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రజలు, రైతులు, విద్యార్థులు, అత్యవసర సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తక్షణ మరమ్మతుల కోసం రూ.15 లక్షలు మంజూరు చేయించి పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. పనులు నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా వర్షాకాలం పూర్తయ్యే వరకు రాయనపల్లి వంతెన వద్ద భద్రతా చర్యలను కట్టుదిట్టంగా చేపట్టాలని, హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# కాళికాదేవి బోనాల మహోత్సవానికి మున్సిపల్ వైస్ చైర్మన్‌కు ఆహ్వానం...



**మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 02(జనంసాక్షి):** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని విశ్వ బ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 9 వ తేదీ వరకు శ్రీ కాళికాదేవి ఆలయంలో నిర్వహించనున్న కాళికాదేవి బోనాల మహోత్సవానికి మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్‌ను సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మహోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆహ్వానాన్ని స్వీకరించిన దొంతి నరేష్ గౌడ్ మహోత్సవాల విజయవంతానికి తన సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ఏలేశ్వర్ బ్రహ్మచారి, కమిటీ సభ్యులు, సంఘ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 6న జరిగే గద్దర్ వర్ధంతి సభను విజయవంతం చేయండి..

- పోస్టర్ ఆవిష్కరించిన గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ..



**సిద్దిపేట, ఆగస్టు 3 (జనంసాక్షి):** ఈనెల 6న సిద్దిపేటలో, హైదరాబాద్‌లో జరిగే ప్రజాయుద్ధ నౌక గద్దర్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ పిలుపునిచ్చింది. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో వర్ధంతి సభ పోస్టర్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమం లో కమిటీ చైర్మన్ పోచబోయిన శ్రీహరి, కో చైర్మన్ ఆస లక్ష్మణ్,ప్రాఖీ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జి. తిరుపతి రెడ్డి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షులు కె. రంగాచారి, ప్రజాగాయకులు భీమసేన, చికోటి నర్సింలు, అవని పత్రిక సంపాదకులు కూతురు రాజిరెడ్డి, పౌరహక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మంజీరా రచయితల సంఘం ప్రధానకార్యదర్శి సిద్దెంకి యాదగిరి, తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు పొన్నాల బాలయ్య,దీజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కంకిటి నవీన్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దాస అంజయ్య, దీూ నాయకులు గుండు శ్రీనివాస్, తెలిజేరు శ్రీనివాస్ యాదవ్, గడీల రమేష్ రెడ్డి, చిటుకుల మైసా రెడ్డి తదితరులు కలిసి పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్ పోచబోయిన శ్రీహరి యాదవ్, కో చైర్మన్ ఆస లక్ష్మణ్ లు మాట్లాడుతూ తన 60 ఏండ్ల జీవితాన్ని ప్రజలకు, ప్రజా యుద్ధానికి, పీడిత ప్రజల విముక్తి కోసం అంకితం చేసి, ప్రజలకు తన పాటను అంకితం చేసిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ భౌతికంగా దూరమై మూడేళ్లు గడుస్తున్నాయని చెప్పారు.. ఆయన భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు, ఆయన బోధించిన ఆకాంక్షలు, ఆయన పాట ఇంకా ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నాయని అన్నారు. ప్రజాయుద్ధ నౌక గద్దర్ కు మరణం లేదని తెలిపారు. ఆయన చూపించిన మార్గంలో అసమ సమాజాన్ని అంతం చేసే వరకు ప్రజల పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగించడం కోసం గద్దర్ కుమారుడు సూర్యం ఆధ్వర్యంలో గద్దర్ ఫౌండే షన్ ఏర్పడిందని తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6 న హైదరాబాద్ రవీంద్రభారతి లో సాయంత్రం 4 గంటలకు వర్ధంతి సభ జరుగుతుందని తెలిపారు.. అదేరోజు ఉదయం 8 గంటలకు సిద్దిపేటలో గద్దర్ విగ్రహం ఏర్పాటుకు ప్రతి పాదించిన స్థలం లో సిద్దిపేట గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ రెండు వర్ధంతి కార్యక్రమాల్లో గద్దర్ అభిమానులు, కవులు, రచయితలు, కళాకారులు, గాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు బూట్ల పంపిణీ



**కొత్తపల్లి, ఆగస్టు 3 (జనంసాక్షి):** కొత్తపల్లి మండలంలోని నిడ్జింత గ్రామంలో గల జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో సోమవారం 360 మంది విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రజిత శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం అవసరమైన బూట్లు అందించడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎం ఆంజనేయులు, వార్డ్ సభ్యులు కాశప్ప, అనూష, సత్యప్ప పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయులు విజయ్, దేవేంద్రప్ప, వేణుగోపాల్, సుజాత, వరలక్ష్మి, నాగేష్, భీమ్సేన్, కే శ్రీనివాస్, వెంకట రాములు, శ్రీను, కృష్ణ, కథలప్ప తదితరులు పాల్గొన్నారు.

# బలమైన భవిష్యత్తుకు తల్లిపాలే పునాది

- చెర్కూకు సెక్టార్ సూపర్వైజర్ సరిత రెడ్డి



**వెల్దంద, ఆగస్టు 03 (జనంసాక్షి):** ప్రపంచ తల్లిపాల వారోత్సవం ఆగస్టు 01 నుంచి 07 వరకు సందర్భంగా చెర్కూర్ సెక్టార్ వెల్దండ మండలం పలు గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్వైజర్ సరిత రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు బలమైన పునాది అని అన్నారు.శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలు ప్రారంభించడం, మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలు కొనసాగించడం వల్ల కలిగే ప్రయోజనాలపై వివరించారు.

అదేవిధంగా ఈ వర్షాకాలం కావున చేతులు సరిగ్గా కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రమీల, చిన్ని, విజయ, చంద్రకళ, లక్ష్మి,మరియు పంచాయతీ సెక్రటరీ లు ఆశ కార్యకర్త, ఏఎన్ఎం లు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి



**మద్దూరు, ఆగస్టు 3 (జనంసాక్షి):** రాష్ట్రంలోని విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మద్దూరు డిగ్రీ కళాశాల ఇంటర్ కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో **"ఫీజుల బకాయి - బీజేపీ లడాయి"** కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా బీజేవైఎం నాయకుడు ఉమేష్ మాట్లాడుతూ, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కింద విడుదల చేయాల్సిన సుమారు రూ.15 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకుండా 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని ఆరోపించారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి తలారి సాయిలు, కోశాధికారి రాఘవేందర్, ప్రశాంత్, శ్రీనివాస్, వెంకటేష్, కిరణ్, నరేష్‌తో పాటు బీజేవైఎం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# కొల్చారం మండలానికి గర్వకారణమైన నియామకాలు

- యాదగిరికి జిల్లా ఉపాధ్యక్ష పదవి
- మధుసూదన్ గౌడ్‌కు జిల్లా కార్యవర్గ సభ్యత్వం





**కొల్చారం, ఆగస్టు 3 (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా మెదక్ జిల్లా కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు జనార్దన్ ప్రకటించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. కొల్చారం మండలంలోని కొంగోడు గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు యన్నారం యాదగిరిని బీజేపీ ఓబీసీ మోర్చా మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడిగా, చిన్నఘణపురం గ్రామానికి చెందిన పెద్దన్నగారి మధుసూదన్ గౌడ్‌ను జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమించారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్ మాట్లాడుతూ, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు, బాధ్యతలు లభిస్తాయని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నూతనంగా బాధ్యతలు చేపట్టిన యన్నారం యాదగిరి, మధుసూదన్ గౌడ్‌లు మాట్లాడుతూ, పార్టీ తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతనంగా నియమితులైన నాయకులను అభినందించారు.

విశ్వశాంతి మహాయాగం

# పూర్ణాహుతిలో ఎమ్మెల్యే కసిరెడ్డి

- రూ.లక్ష విరాళం అందజేసిన పీసీసీ సభ్యుడు మైసిగండి శ్రీనివాస్ గౌడ్



**కల్వకుర్తి,ఆగస్టు 3,(జనంసాక్షి):** కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్‌లో నిర్వహించిన శ్రీకృష్ణ కాలచక్రం 91వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం మంగళవారం పూర్ణాహుతితో ఘనంగా ముగిసింది. మహాయాగం చివరి రోజు నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాలలో వేదపండితుల ఆశీర్వాదాలు స్వీకరించి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పీసీసీ సభ్యుడు మైసిగండి శ్రీనివాస్ గౌడ్ మహాయాగ నిర్వహణకు రూ.1 లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రవీణ్ గౌడ్,గుండ్రాతి కుమార్ గౌడ్,ధోని తులసీరామ్ నాయక్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూర్ణాహుతిలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# వ్యవసాయ కూలీలకు జీవభృతి చెల్లించాలి...

**జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి**
**అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్**



**ఆత్మకూర్, ఆగస్టు 3 (జనంసాక్షి):** వ్యవసాయ కూలీలకు 7500 జీవనభృతి వెంటనే చెల్లించాలి అనిఅఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ అన్నారు. సోమవారం అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర పిలుపులో భాగంగా మండల తహసిల్దార్లకు వినతి పత్రాలు అందించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2026 సంవత్సరం కరీపు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్న ఏలినివో ప్రభావంతో వర్షాభావం ఏర్పడింది అన్నారు, వర్షాలు పడక రైతాంగం కూలీలు తీవ్రంగా నష్టపోయారు, వ్యవసాయ కార్మికులకు చాలా గ్రామాల్లో పనులు లేక ఒక పూట దొరకడం కష్టంగా మారింది బ్రతుకు భారమై వ్యవసాయ కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే ప్రమాదం వచ్చింది, రాష్ట్రవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయి వ్యవసాయ కూలీలకు పనులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది, 200 రోజులు కూలీలకు పనులు కల్పించాలి, కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధి హామీ పథకం పేరు మార్చి అమలు చేస్తున్న విబిజి రామ్ పథకంలో రాష్ట్రాలకు 40 శాతం వాటా విధించడం కొలతల ప్రకారం చెల్లింపు చేయడం పనులు చేయలేని పరిస్థితిలో కూలీలు ఉన్నారు, కూలీలకు గిట్టుబాటు ధర కల్పించాలి. కనుక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరువు నివారణ చర్యలు చేపట్టాలి కార్మికులకు ఉపాధి కల్పించాలి తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు,డిమాండ్స్ వ్యవస్థ వ్యవసాయ కూలీలకు జీవన భృతి కరువు సాయం కింద నెలకు 7500 ఇవ్వాలి. ప్రతి కుటుంబానికి 20 కేజీల బియ్యం ఇవ్వాలి ,కరువు సాయక చర్యలు చేపట్టాలి, కరువు జిల్లాగా ప్రకటించాలి అని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో ఒక మండల అధ్యక్షులు స్టీఫెన్, గోవిందు వెంకటయ్య, హోసన్న తదితరులు పాల్గొన్నారు,

# ఆయుధాల వినియోగంపై పట్టు సాధించాలి : ఆర్ఐ విజయ్ భాస్కర్

**నారాయణపేట ఆగస్టు 3(జనం సాక్షి):**
ఆయుధాల వినియోగంపై పోలీసులు పట్టు సాధించా లని ఆర్ ఐ విజయ్ భాస్కర్ అన్నారు.జిల్లా ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం,శారీరక దారుఢ్యాన్ని మెరుగుపర చడం, ఆయుధాల విని యోగంలో మరింత ప్రావీ ణ్యం సాధించడం లక్ష్యంగా జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్ లో మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఆర్ ఐ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం అత్యంత బాధ్యతాయు తమైనదని, ప్రతి పోలీసు సిబ్బంది తమ వృత్తి నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ ఆధునిక పోలీసింగ్‌కు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. విధినిర్వహణలో ఆత్మవిశ్వాసం తో పాటు ఆయుధాల విని యోగంపై పూర్తి అవగాహ న, నైపుణ్యం కలిగి ఉండ డం అత్యంత అవసరమ న్నారు.ప్రతి పోలీసు సిబ్బం ది శారీరకంగా, మానసి కంగా దృఢంగా ఉండేందు కు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, పరేడ్, డ్రిల్, ఫైరింగ్, వెపన్ హ్యాండ్లింగ్ వంటి అంశాల్లో నిరంతరం సాధన చేయాల ని తెలిపారు. శిక్షణ ద్వారా అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.పోలీసు శాఖలో క్రమశిక్షణ, సమయపా లన, బాధ్యతాయుతమైన విధి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతోమర్యాదపూర్వకంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించడం ద్వారా పోలీసు శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించవచ్చని అన్నారు.అంతేకాకుండా,చట్టాలపై అవగాహన, ఆధునిక దర్యాప్తు విధా నాలు, ప్రజా సంబంధాల మెరుగుదల, ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కూడా ప్రతి పోలీసు సిబ్బంది పెంపొం దించుకోవాలని సూచిం చారు.శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణ లో సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు నాణ్యమై న, వేగవంతమైన పోలీసు సేవలు అందించాలని పిలుపునిచ్చారు.ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ట్రైనర్ హెడ్ కానిస్టేబుల్ రాములు పోలీ సు సిబ్బందికి డ్రిల్, వెపన్ హ్యాండ్లింగ్, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం తదితర అంశాలపై శిక్షణ అందించా రు.ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ ఐ శ్వేత, శిరీష, ట్రైనర్ హెడ్ కానిస్టేబుల్ రాములు, వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# కౌన్సిలర్ అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి



**నారాయణపేట ఆగస్టు 3(జనంసాక్షి):** నారాయణపేట మున్సిపాలిటీలో కంచె చేను మేస్తోంది.అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన మున్సిపల్ పాలక వర్గ సభ్యుడు ప్రస్తుత కౌన్సిలర్ రాజేష్ ఘూట్,ఆయన సోదరుడు మురళి మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించుకుని అక్రమ నిర్మాణం చేస్తున్నాడు.ఈ విషయంపై చంద్రకాంత్ చామకూర మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. లైన్ వాడలోని తన ఇంటి నెంబర్ 4బి 11బి69 ముందు కౌన్సిలర్ రాజేష్ ఘూట్,సోదరుడు మురళి అక్రమంగా గోడ నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. గత 70 ఏళ్ల నుంచి అక్కడ ఎలాంటి నిర్మాణం లేదని ఇప్పుడు కౌన్సిలర్ అధికార బలంతో అక్రమ నిర్మాణం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తున్నారని తెలిపారు.ఈ అక్రమ నిర్మాణాన్ని వెంటనే ఆపి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను కోరారు.ద

# ముడుమాల్ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటి ఎన్నిక

- అధ్యక్ష,ప్రధాన కార్యదర్శిలుగా మాసగాళ్ల ఓబులేష్,జక్లేర్ పరశురాం

**కృష్ణ, ఆగస్టు 3 (జనంసాక్షి):**
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణ మండలం,ముడుమాల్ గ్రామంలోనీ రైతు వేదిక వద్ద ఏర్పాటైన సమావేశంలో పాత ముడుమాల్ అంబేద్కర్ యువజన సంఘం కమిటీ రద్దు చేసి,దాని స్థానంలో కొత్త కమిటీని ఎన్నుకున్నారు

ముందుగా రద్దైన పాత కమిటీ అధ్యక్షులు తిమ్మప్ప,ప్రధాన కార్యదర్శి మహా దేవప్ప కార్యవర్గం సంఘానికి చేసిన సేవలను కొనియాడుతూ నాయకుల కు ఘనంగా వీడ్కోలు పలికారు .ప్రజాస్వామిక వాతావరణంలో చేపట్టిన ఎన్నికల ద్వారా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలుగా మాసాగాళ్ల ఓబులేష్,జక్లేర్ పరుశురాంలతో పాటు మొత్తం 10 మందితో నూతన ముడుమాల్ అంబేద్కర్ యువజన సంఘం కమిటీని ఎన్ను కున్నారు.



ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ నియోజకవ ర్గ నాయకులు మాట్లాడుతూ ముడుమాల్ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే.. మహాత్మ పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలక నుగుణంగా విద్య,ఆర్థిక, సామాజిక రాజకీయ రంగాలలో దళిత,బహు జన మరియు పీడిత వర్గాల అభివృద్ధికి తోడ్పడే కార్యచరణతో సంఘానికి మంచి పేరు తీసుకొచ్చేలా పనిచేయాలని ముడుమల్ గ్రామ నూతన కమిటీకి ఎన్నికైన నాయకులకు దిశనిర్దేశం చేశారన్నారు.

ముడుమాల్ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీఅధ్యక్షులు:
మాసగాళ్ల ఓబులేష్,ఉపాధ్యక్షులు బ్యాగరి నరేష్ ,ఆరేళ్ల యువరాజ్ ప్రధాన కార్యదర్శి జక్లేర్ పరశురాం, సహాయ కార్యదర్శులు బి.తిరుమలేష్,ఆరేళ్ల లక్ష్మణ ,కోశాధికారిమహేందర్,ఉప కోశాధికారి దేవేందర్,సాంస్కృతిక కార్యదర్శి, మహేందర్, సోషల్ మీడియా ఇన్చార్జ్ చిన్నమేటి హనుమంతు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ నియోజకవర్గం అధ్యక్షులు పృథ్వీరాజ్, మానవ హక్కుల కార్యకర్త మద్దిలేటి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తల్వార్ నరేష్, అంబేద్కర్ యువజన సంఘం ముడుమల్ పాత కమిటీ, కొత్త కమిటీ అధ్యక్షులు కార్యవర్గంతో తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ కాలచక్ర మహాయజ్ఞానికి ముచ్చర్ల జనార్దన్ రెడ్డి భారీ విరాళం

- నిర్వాహకులకు 5 లక్షల చెక్కు అందజేత



**ఉర్కొండ, ఆగస్టు 03, (జనంసాక్షి);**
కల్వకుర్తి పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ మైదానంలో జరుగుతున్న శ్రీకృష్ణ కాలచక్ర మహాయజ్ఞానికి బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి భారీ విరాళం 5 లక్షల రూపాయల చెక్కును భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు ముచర్ల జనార్దన్ రెడ్డి అందజేశారు. యజ్ఞ నిర్వాహకులను కలిసిన ఆయన, చెక్కును అందజేసి యజ్ఞం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సనాతన ధర్మ పరిరక్షణలో ఇలాంటి మహాయజ్ఞాలు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. కాలచక్ర పూజలు, వేద పఠనాలతో జరుగుతున్న ఈ మహాయజ్ఞంలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందుతున్నారు. యజ్ఞ కమిటీ సభ్యులు ముచర్ల జనార్దన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసి, శాలువా, ప్రసాదం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యజ్ఞ నిర్వాహకులు మాజీ ఎంపీటీసీ కలిమిచర్ల గోపాల్,బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యజ్ఞ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో తప్పులకు తావివ్వొద్దు

• నర్సాపూర్‌లో ఎస్ఐఆర్-బీఎల్ఏల సమీక్ష సమావేశం



**నర్సాపూర్, ఆగస్టు 3 (జనంసాక్షి):** ఓటరు జాబితా పూర్తిగా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో ఉండేలా బీఎల్ఏలు, సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేయాలని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ అన్వేష్‌రెడ్డి సూచించారు. నర్సాపూర్ పట్టణంలోని శ్రీ సాయి కృష్ణా గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన ఎస్ఐఆర్–బీఎల్ఏ సూపర్వైజర్ల సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని, ఇందుకు కృషిచేసిన ప్రతి బీఎల్ఏ, సూపర్వైజర్‌ను అభినందించారు. అయితే, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లు, మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓటర్ల వివరాల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో మరోసారి పూర్తిస్థాయిలో ధృవీకరణ చేపట్టి, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి బూత్‌లో ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఎలాంటి అభ్యంతరాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు, సూపర్వైజర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పూర్తిగా పాటించాలని పేర్కొన్నారు.సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, పార్టీ నాయకులు, మండల, పట్టణ అధ్యక్షులు, బీఎల్ఏలు, సూపర్వైజర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ వైర్ల దొంగల ముఠా అరెస్ట్..!

### 750 కేజీల వైర్, రూ.75 వేలు స్వాధీనం

**వెల్దండ, ఆగస్టు 03 (జనంసాక్షి):** గత కొంతకాలంగా ఖాళీ వెంచర్లే లక్ష్యంగా చేసుకొని వెంచర్లో వేసిన కరెంటు లైన్స్ మీద ఉన్న విద్యుత్ వైర్లను కట్ చేసి దొంగిలించిన ఇద్దరు నేరస్తులు మునావత్ దినేష్ (కొడుకు),మునావత్ మోహన్(తండ్రి) నివాసం కవులోనిబవి తండా మహేశ్వరం లో పాత ఇనుప సామాను వ్యాపారం నిర్వహిస్తున్నారు. రాజు, దినేష్, రమేష్ తో కలిసి సులభంగా డబ్బులు సంపాదించాలని దొంగతనాలకు పాల్పడినట్టు పోలీసులు వెల్లడించారు. సోమవారం ఉదయం కొట్ర చౌరస్తా దగ్గరలో అనుమానం గా ఉండటంతో పట్టుకొని విచారించగా మే నెలల్లో పెద్దాపూర్ శివారులో ఉన్న ఆర్.ఆర్. ఆర్ వెంచర్ లో దినేష్, మోహన్,దినేష్, రమేష్ హైదరాబాద్ నివాసం 5 గురు కలిసి సుమారు 60 పోల్స్ వైర్ దొంగతనం చేయడం జరిగిందని తెలిపారు.దాని తర్వాత జూన్ నెల మొదటి వారం లో కల్వకుర్తి ఏరియా లో బాలాజీ టౌన్ షిప్ లో సుమారు 30 స్తంభాల విద్యుత్ వైర్, తరవాత జూలై నెల 12న కొట్ర గ్రామ శివారులో ఒక వెంచర్ లో సుమారు 70 స్తంభాల కరెంటు వైర్ ని దొంగతనం 5 గురు కలిసి దొంగిలించిన సమాచారాన్ని పోలీసులు రాబట్టారు.దొంగ తనం చేసిన వైర్ ను చిన్న చిన్న ముక్కలుగా చేసి



మోహన్ తన షాప్ దగ్గరికి వచ్చి పాత సామాన్లు వేసుకునే వారికి కొంత అమ్మడం జరిగింది. ముగ్గురిని అరెస్టు చేసి 750 కిలోల కరెంట్ వైర్, రూ.75,000/- రూపాయలు, నేరానికి ఉపయోగించిన ఒక ట్రాలీ ఆటో మరియు ఒక మహేంద్ర థార్ వెహికల్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని సీఐ రఘువీర్ రెడ్డి, ఎస్సై యుగంధర్ రెడ్డిలు తెలిపారు.పరారీలో ఉన్న రాజు, దినేష్, రమేష్ లను త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఈ కేసును చాకచక్యంగా చేదించిన, సీఐ, ఎస్సై, పోలీసు కానిస్టేబుల్ నజీర్, అంజి ,నవీన్, కిషోర్ కుమార్ రెడ్డిలను కల్వకుర్తి డీఎస్పీ అభినందించడం జరిగింది.

## నకిలీ బిల్లులకు చెక్..ఎరువుల విక్రయాల్లో కొత్త వ్యవస్థ..

• ఎరువుల విక్రయాల యాప్‌పై డీలర్లకు అవగాహన
• బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు విక్రయిస్తే.డీలర్‌లపై కఠినమైన చర్యలు తప్పవు..
• మండల వ్యవసాయ అధికారి ఏవో.నరేందర్

**మహమ్మదాబాద్,ఆగస్టు 03(జనంసాక్షి):** రైతులకు ఎరువులు సమయానికి, పారదర్శకంగా అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్ వినియోగంపై రాష్ట్రవ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం రైతు వేదికలో మండల స్థాయిలో ఎరువుల డీలర్లుకు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, మండల వ్యవసాయ శాఖ అధికారి ఏవో నరేందర్ మాట్లాడుతూ.. యాప్ ద్వారాఎరువుల నిల్వలు, అమ్మకాలు, బిల్లులు ఆన్‌లైన్‌లో నమోదవుతాయని,రైతుల ఆధార్ వివరాలతో కొనుగోలు వివరాలు నమోదు కావడంతో బ్లాక్ మార్కెటింగ్,నకిలీ బిల్లులు,డూప్లికేట్ విక్రయాలకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు వివరించారు.



రైతులకు ఈయాప్ ఎంతో ప్రయోజనకరమని, ప్రతి విక్రయాన్నియాప్‌లో నమోదు చేయడం డీలర్లకు తప్పనిసరి అని తెలిపారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) ఎరువుల దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

## హెచ్‌పివి టీకాను వేసుకుందాం క్యాన్సర్‌ను దూరం చేద్దాం

• గ్రామ సర్పంచ్ వై శైలజ శ్రీనివాస్ రెడ్డి



**మల్దకల్, ఆగస్టు3 (జనంసాక్షి):** మండల పరిధిలోని బిజ్వారం గ్రామ గ్రామంలోని సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలప్రధానోపాధ్యాయుడు జి.మహేష్ అధ్యక్షతన ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ వై శైలజ శ్రీనివాస్ రెడ్డి,హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్,ఎంఎల్ హెచ్ పి మాట్లాడుతూ.14,నుండి 15 సంవత్సరాల వయసు నిండిన బాలికలికలు ప్రతి ఒక్కరు హెచ్ పి వి వ్యాక్సిన్ తప్పకుండగావినియోగించుకోవాలని అన్నారు.ఈ యొక్క హెచ్ పి వి వ్యాక్సిన్ క్యాన్సర్ రోగానికి ఉపయోగపడుతుందని అన్నారు.గర్భాశయ ముఖద్వారం ద్వారా ఏర్పడే క్యాన్సర్ బారిన పడకుండగా జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అందుకు ఈ యొక్క టీకా వాడుకోవాలని అవసరం ఎంతైనా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక హెల్త్ సిబ్బంది,ఆశ వర్కర్లు,పంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

## వాలీబాల్‌లో గాధిర్యాల్ సత్తా... విజేతలకు ఘన సన్మానం

• క్రీడలతో పాటు విద్యలోనూ యువత రాణించాలి..సర్పంచ్ టీ.మాణిక్యమ్మ

**మహమ్మదాబాద్,ఆగస్టు 03 (జనంసాక్షి):**
ప్రతిభ కనబరుస్తూనే విద్యా రంగంలోనూ యువత ముందంజలో నిలవాలని గాధిర్యాల్ గ్రామ సర్పంచ్ టీ.మాణిక్యమ్మ పిలుపునిచ్చారు.



మహమ్మదాబాద్ మండలంలోని గాధిర్యాల్ గ్రామ వాలీబాల్ జట్టు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన18వ ఈషా గ్రామోత్సవం అంతర్‌జిల్లా వాలీబాల్ టోర్నమెంట్‌లో ద్వితీయ స్థానం సాధించి.గ్రామానికి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు.వికారాబాద్,మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన 30కిపైగా గ్రామాల జట్లు పోటీపడిన ఈటోర్నమెంట్‌లో గాధిర్యాల్ జట్టు అత్యుత్తమ ఆటతీరుతో ఆకట్టుకుని ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది.ఈసందర్భంగా సోమవారం పంచాయతీ కార్యాలయంలో సన్మన కార్యక్రమము ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా,టీ.మాణిక్యమ్మ పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి,వారు మాట్లాడుతూ..యువత క్రీడ రంగంలోనే కాకుండా విద్యారంగంలో కూడా ప్రతిభచాటాలని అన్నారు.అనంతరం క్రీడాకారులతో పాటు,పరిశుద్ధ కార్మికురాలని,సర్పంచ్ మాణిక్యమ్మ శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.గ్రామ యువత క్రీడలతో పాటు విద్యలోనూ ఉన్నత శిఖరాలు అధిరోహించి గ్రామానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు జి చంద్రయ్య,మాజీ అధ్యక్షుడు జి అనంతయ్య,తలారి రాములు,ఇరువింటి అంజలయ్య,రాములు,హర్జన్ చిన్నయ్య,పాఠశాల హెడ్ మాస్టర్ రాములు,పారిశుద్ధి కార్మికులు యువకులు పాల్గొన్నారు.

## బిజెపిని పటిష్టం చేయాలి

• జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు భరత్
• మండల బిజెవైఎం అధ్యక్షుడుగా ఒట్టెవోల్లా సురేష్



**కృష్ణ, ఆగస్టు 3 (జనంసాక్షి):** మండలంలో బిజెవైఎం కార్యకర్తలు గట్టిగా పనిచేసి బీజేపీని పటిష్టం చేయాలని జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు భరత్ పిలుపు ఇచ్చారు. సోమవారం కృష్ణ మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భారతీయ జనతా పార్టీ కృష్ణ మండల అద్యక్షులు నల్లే నర్సప్ప, జిల్లా బిజెవైఎం అద్యక్షులు భారత్ అద్వర్యశీలో కృష్ణ మండలం బి జె వై ఎం నూతన కమిటీని ఎన్నుకున్నారు.బిజెవై ఎం అధ్యక్షుడుగా గుడెబల్లూర్ గ్రామానికి చెంధిన ఒట్టెవోల్లా సురేష్ ను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా సురేష్‌ను ఘనంగ సన్మానించారు.అనంతరం బిజెవైఎం జిల్లా అద్యక్షులు భరత్ మట్లాడుతు విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి వీధి ఫీజ్ రియంబర్స్ చెయలాని డిమాండ్ చెసారు.
కృష్ణ మండలం నూతన బిజెవైఎం అద్యక్షులు అద్వర్యంలోసంస్టాగటంగ యువతను పార్టిలో చెర్పించి పార్టిని బలోపేతం చేయలన్నారు.ఈ సందర్భంగా మోధటి సారి మండలానికి వచ్చిన జిల్లా బిజెవైఎం అద్యక్షుని మండల కమిటి అద్వర్యంలో ఘనంగ సన్మానించారు .కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా నాయకులు మంజునాథ్,వన్నవాడ శ్రీకాంత్, మండల ప్రదాన కార్యదర్శులు డి రాఘవేంద్ర,సచిన్ బాట,సురేష్ బాత్,జల తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో ఘనంగా 75వ వన మహోత్సవం

• బట్ల చెరువు కట్టపై ఈత మొక్కల నాటకం




**చిలప్ చేడ్, ఆగస్టు03 (జనంసాక్షి):**
మండలంలోని జగ్గంపేట గ్రామంలో 75వ వన మహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలోని బట్ల చెరువు కట్టపై సోమవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ రాఘవేందర్ రావు ఆధ్వర్యంలో ఈత మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎస్ఐ రాఘవేందర్ రావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ముఖ్యంగా ఈత చెట్ల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యతతో పాటు గ్రామీణ జీవనోపాధికి కూడా దోహదం చేకూరుతుందని పేర్కొన్నారు.
గౌడ సంఘ సభ్యులు తదితరులు పాల్గొని ఈత మొక్కలను నాటారు. వన మహోత్సవం సందర్భంగా గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్రవంతి రాందాస్ గౌడ్,గ్రామ కార్యదర్శి యాదగిరి ఉపసర్పంచ్ మాజీ సర్పంచ్వా అనంత రామగౌడ్, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.


## అఖండ భజన
# సప్తాహ కరపత్రంను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**మల్దకల్, ఆగస్టు 3 (జనంసాక్షి):** గద్వాల జిల్లా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం మల్దకల్ మండల కేంద్రంలోని శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అఖండ భజన సప్తాహ కార్యక్రమము ఈనెల8 నుండి 15 తేదీ వరకుజరిగే అఖండ జ్యోతి సప్తాహ భజన కరపత్రమును ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సకాలంలో వర్షాలు పడాలని రైతులు పండించిన పంటలు మంచి గిట్టుబాటు ధర రావాలి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి గద్వాల సస్యశ్యామలముగా ఉండాలని కోరుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సిరి సంపదలతో కలిగి ఉండాలని ఈసప్తాహ భజన దేవాలయ ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ప్రహ్లాద రావు,సర్పంచ్ చిట్టెమ్మ,హార్మోనిస్ట్ పచ్చర్ల రాఘవేంద్రచారి, ప్రసాదాచారి, చంద్రశేఖర రావు,నాయకులు వెంకటన్న ,మాజీ సర్పంచ్, కొంకతినరేందర్, మధు,తిమ్మరాజు, పరుశరాముడు,నాగరాజు, ఉప్పరినారాయణ, నర్సింహులు, ప్రవీణ్,తిమ్మప్ప,బాదం శ్రీనివాసులు, మనసాని నాగరాజు,రాజు,కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నవాబుపేటకు వెంటనే (PR AEE)ని
# నియమించాలి: సర్పంచుల సంఘం డిమాండ్

**నవబుపేట్, (జనంసాక్షి):** మండలంలో నిలిచిపోయిన గ్రామాల అభివృద్ధి పనులను పునరుద్ధరించడానికి వెంటనే పంచాయతీ రాజ్ సహాయక కార్యనిర్వాహక ఇంజనీర్ (PR AEE)ను నియమించాలని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సంతోష్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.



ఈ సందర్భంగా సంతోష్ నాయక్ మాట్లాడుతూ.. నవాబుపేట మండలంలో గత నాలుగు నెలలుగా (PR AEE) పోస్టు ఖాళీగా ఉండటం వల్ల మండల పరిధిలోని 42 గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సుమారు 4 నుండి 5 కోట్ల రూపాయల విలువైన గ్రామీణ రోడ్లు, డ్రైనేజీలు, వైకుంఠ ధామాలు మరియు ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయన్నారు. సాంకేతికంగా అనుమతులు (Technical Sanctions) రాకపోవడం, బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడంతో సర్పంచులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

## కౌన్సిలర్ సంపత్ కుమార్
# విజ్ఞప్తితో ఏఈ క్షేత్రస్థాయి పరిశీలన

**కోహీర్, ఆగస్టు 3 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభమయ్యాయి. స్థానిక కౌన్సిలర్ నాగరిగారి సంపత్ కుమార్ వార్డులోని విద్యుత్ సమస్యలను విద్యుత్ శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్లడంతో, సోమవారం ఏఈ స్వయంగా వార్డును సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. పరిశీలన సందర్భంగా వంగిపోయిన విద్యుత్ స్తంభాలు, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు, ఇతర విద్యుత్ సంబంధిత సమస్యలను పరిశీలించిన కౌన్సిలర్ సంపత్ కుమార్ వాటిని వెంటనే తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న వైర్లను మార్చి ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని అధికారులను కోరారు.



దీనిపై స్పందించిన ఏఈ సంబంధిత కాంట్రాక్టర్‌కు వెంటనే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అవసరమైన మరమ్మతులు, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు వెంటనే స్పందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ, పనులు త్వరగా పూర్తి చేసి శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరుతున్నారు.

# వీధి కుక్కల బెడదపై మున్సిపల్ అధికారులకు బీజేపీ వినతి

**మక్తల్, ఆగస్టు 03 (జనంసాక్షి):** మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకూ తీవ్రమవుతున్న వీధి కుక్కల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మక్తల్ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యపై చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కి, మున్సిపల్ మేనేజర్‌కి కూడా వినతిపత్రాలు అందజేశారు. గత నెల 29వ తేదీన మక్తల్ పట్టణంలో 10 మందికి పైగా ప్రజలపై వీధి కుక్కలు దాడి చేశాయి. కుక్కకాటుకు గురైన వారిలో కొందరు నారాయణపేట జిల్లా ఆసుపత్రిలో, మరికొందరు మహబూబ్‌నగర్, రాయచూర్ ఆసుపత్రులలో చికిత్స పొందగా, మరికొందరు స్థానికంగా చికిత్స తీసుకున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. ఘటన జరిగిన రోజే మున్సిపల్ కమిషనర్‌కి ఫోన్ ద్వారా సమాచారం అందించామని, కౌన్సిల్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారని పేర్కొన్నారు. మరుసటి రోజు ప్రత్యక్షంగా కలిసి విద్యార్థులపై కూడా వీధి కుక్కలు దాడులకు యత్నిస్తున్నాయని వివరించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ మహిళలు, చిన్నారులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు వీధి కుక్కల బారిన పడుతున్నారని, కౌన్సిల్ సమావేశం పేరుతో సమస్యను వాయిదా వేయడం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆగస్టు 15 స్వాతంత్ర్య



దినోత్సవ వేడుకల సందర్భంగా ఉదయాన్నే పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వీలైనంత త్వరగా వీధి కుక్కలను సురక్షిత ప్రదేశాలకు తరలించి, వాటికి అవసరమైన వైద్య చికిత్స అందించి ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజల తరఫున బీజేపీ మక్తల్ శాఖ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామని, ఆ పరిస్థితికి పూర్తి బాధ్యత మున్సిపల్ యంత్రాంగానిదేనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజశేఖర్ రెడ్డి, పీకే నరసింహ, తప్ప కృష్ణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బి.భరత్, బ్యాటరీ రాజు, కే.నరేందర్, మహేష్ సాగర్, శ్రీకాంత్, మంజునాథ్, ఆంజనేయులు, నవీన్, జావిద్, అశోక్, గోవిందు, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సౌకర్యమే ధ్యేయం.... గ్రామం అభివృద్ధే లక్ష్యం

- **జకినాలపల్లిలో అండర్ డ్రైనేజీ పనులకు శ్రీకారం**
- **ప్రారంభించిన సర్పంచ్ శేఖర్ యాదవ్**

**ఉర్కొండ, ఆగస్టు 03, (జనంసాక్షి);** ఉర్కొండ మండలంలోని జకినాలపల్లి గ్రామంలోని 6వ వార్డులో 5 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అండర్ డ్రైనేజీ పనులకు సర్పంచ్ శేఖర్ యాదవ్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజశేఖర్, వార్డు సభ్యులు జహంగీర్ బాబా, మహిపాల్, వెంకటేష్, శారదమ్మ, మాధవితో పాటు గ్రామ పెద్దలు, మాజీ ప్రజా ప్రతినిధులు,యువకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ, గ్రామంలో మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు అండర్ డ్రైనేజీ పనులు చేపడుతున్నామని తెలిపారు. వర్షాకాలంలో నీరు నిలవకుండా, దుర్వాసన రాకుండా ఈ పనులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నాణ్యతతో కూడిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.



గ్రామ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్దేశంతో ప్రతి వార్డుతో పాటు గ్రామాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేస్తానని సందర్భంగా తెలియజేశారు. అండర్ డ్రైనేజీ లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న వార్డుకు సంబంధించిన ప్రజలు పనులు ప్రారంభం చేయడంతో సర్పంచ్ శేఖర్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# సంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.సంతోష్ కుమార్

**సదాశివపేట, ఆగస్టు 3(జనంసాక్షి):** టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం సదాశివపేట ఎస్.వి.ఎస్ బ్యాంకెట్ హాల్ లో సోమవారం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉమ్మడి మెదక్ జిల్లా రాజ్ న్యూస్ స్టాఫ్ రిపోర్టర్ జి.సంతోష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైసల్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు సయ్యద్ ఆసిఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్ నియామక పత్రాన్ని అందజేశారు.



ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, యూనియన్ బలోపేతం, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతతో పనిచేస్తానని చెప్పారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని పేర్కొన్నారు.
ఈ నియామకంపై జిల్లా వ్యాప్తంగా పలువురు జర్నలిస్టులు, యూనియన్ నాయకులు సంతోష్ కుమార్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే –ఐ జే యు జిల్లా అధ్యక్షుడు బండారి యాదగిరి,జిల్లా ఉపాధ్యక్షుడు ఆడెం మల్లేశం, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మారిన మట్టి రోడ్లు

- **నిత్యం నరకం చూస్తున్న కాలనీ వాసులు**

జడ్చర్ల, ఆగస్టు 3 (జనంసాక్షి): కావేరమ్మపేట రోడ్డులో మైనార్టీ హాస్టల్ ఎదురుగా ఉన్న దాచని వెంకటరెడ్డి నగర్ కాలనీ రోడ్లు గుంతలమయంగా మారి అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయని, వెంటనే అధికారులు స్పందించి వాటిని పూడ్చి సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. మట్టి రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
అక్కడే మెయిన్ రోడ్డుపై జరుగుతున్న కల్వర్టు రిపేరు పనుల కారణంగా వాహనాలన్నీ ఈ మార్గం గుండానే మళ్లించడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిందని, వర్షాల సమయంలో చెరువులను తలపించేలా రోడ్లపై నీరు నిలిచిపోవడంతో పిల్లల పాఠశాలలకు, ఆఫీసులకు వెళ్లేవారికి తీవ్ర అంతరాయం కలుగుతోందని వాపోయారు.



ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి, కాలనీలో నెలకొన్న రోడ్డు, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. సోమవారం కాలనీ రోడ్ల సమస్యను పరిష్క రించాలని మున్సిపల్ కార్యాలయంలో వినిత పత్రం ఇచ్చినట్లు కాలనీ వాసులు తెలిపారు.

# నిర్లక్ష్య అధికారులపై ఆగ్రహించిన ఎమ్మెల్యే....

- మండల సర్వసభ్య సమావేశంలో పలువురు
- అధికారులకు మెమోలు జారీ చేయాలని ఆదేశం
- పొంతనలేని సమాధానాలతో అధికారులకు మెమోలు
- ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



**శ్రీరంగాపూర్ ఆగస్టు 3 (జనంసాక్షి):** శ్రీరంగాపురం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి హాజరై అన్ని శాఖల పనితీరుపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై శాఖల వారీగా అధికారులను ప్రశ్నిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు.సమీక్ష సందర్భంగా పలు శాఖల అధికారులు సరైన సమాచారం లేకుండా, పొంతనలేని సమాధానాలు ఇవ్వడంపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ముఖ్యంగా మండల విద్యాధికారి హనుమంతు విద్యాశాఖకు సంబంధించిన ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు చెప్పలేకపోవడంతో మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలు అమలు చేస్తుంటే, అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యా వ్యవస్థ దెబ్బతినడం అత్యంత బాధాకరమన్నారు.ప్రజల పట్ల బాధ్యతతో పని చేయని అధికారులను ఉపేక్షించేది లేదు" అని హెచ్చరించారు.విద్యాశాఖ పనితీరుపై సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వడంలో విఫలమైన మండల విద్యాధికారి హనుమంతుకు మెమో జారీ చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.అలాగే సమావేశంలో సంబంధిత అంశాలపై స్పష్టత ఇవ్వలేని విద్యుత్ శాఖ లైన్‌మన్‌కు కూడా నోటీసు జారీ చేయాలని సూచించారు.మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని నీటిపారుదల శాఖ అధికారుల తీరుపై కూడా ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు సంబంధించిన కీలక సమావేశానికి గైర్హాజరు కావడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, సంబంధిత ఇరిగేషన్ అధికారులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన వెంటనే మార్చాలని, విద్యుత్ అంతరాయాలను తగ్గించాలని సూచించారు. ఇప్పటికే విద్యుత్ శాఖ ద్వారా సుమారు రూ.140 కోట్ల అభివృద్ధి పనులు తీసుకొచ్చామని, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు.రైతులకు ఎరువులు, విత్తనాల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రైతు భరోసా, పంటల నమోదు, వ్యవసాయ విస్తరణ సేవలు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.రైతులకు ప్రతి ప్రభుత్వ పథకం సకాలంలో అందేలా అధికారులు గ్రామస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, మందుల కొరత లేకుండా చూడాలని, గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, ఇంకుడు గుంతలు, గ్రామాభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు.ధరణి సంబంధిత సమస్యలు, భూ వివాదాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, రైతుల భూముల సమస్యలు పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం సహించబోమని హెచ్చరించారు.కాలువల నిర్వహణ, సాగునీటి పంపిణీ, పెండింగ్ మరమ్మతులు, రైతులకు సాగునీరు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారులు ప్రజలకు ఎలా జవాబుదారులు అవుతారని ప్రశ్నిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అధికారులు ప్రజల పట్ల జవాబుదారీతనంతో పనిచేయాన్నారు.ప్రభుత్వ షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి ,ముఖ్యమంత్రి సహాయ నిధి, వంటి పథకాలలో అధికారులు గానీ నాయకులు గానీ అవినీతికి పాల్పడితే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిష్ఠాత్మక పథకాల అమలులో నిర్లక్ష్యం, సమావేశాలకు గైర్హాజరు, ప్రజల సమస్యల పట్ల అలసత్వం ఏ మాత్రం సహించేది లేదు. పనితీరు మెరుగుపరచుకోని అధికారులపై కఠిన చర్యలు తప్పవుఅని స్పష్టం చేశారు.కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ప్రమోదిని రెడ్డి ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, సింగిల్ విండో అద్యక్షులు కోదండరామిరెడ్డి, మండల ప్రత్యేక అధికారి సుధారాణి. ఎమ్మార్వో వరలక్ష్మి ఎంపీడీవో సునీత ఎం పి ఓ రాజు సర్పంచులు పంచాయతీ కార్యదర్శిలు అధికారులు పాల్గొన్నారు.

## బిబినగర్ తాండా రోడ్డు బురదమయం... గ్రామస్తులకు తప్పని తిప్పలు





**రాజాపూర్, ఆగస్టు 3(జనంసాక్షి):** మండల పరిధిలోని గిరిజన తాండాలకు వేళ్ళే రహదారులు ఎక్కువగా మట్టి రోడ్లే ఉన్నాయి. వర్షం పడిందంటే బురదమయంగా మారి, రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుంది.అని ఎంతమందికి విన్నవించినా పట్టించుకునే వారే లేరని గిరిజన తాండాల ప్రజలు అంటున్నారు. బిబినగర్ తాండా గ్రామపంచాయతీకి వెల్లే మట్టి రోడ్డు బురదమయంగా మారి బిబినగర్, సేవ్య తాండా ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ పొలాలకు వెళ్లాలన్నా,ఎరువులు తీసుకుని పోవాడానికి ఇబ్బంది కలుగుతుందని తాండా వాసులు అంటున్నారు. బిబినగర్ లోని ఇల్లముందు మురుగు నీరు, వర్షం నీరు నిలిచి ప్రజలు సిజనల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉంటుందని తాండా వాసులు అంటున్నారు. తాండాకు బీటి రోడ్డు వేయించాలని స్థానిక ప్రజా ప్రతినిధులను తాండా వాసులు కోరుతున్నారు. పారిశుధ్యం పై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉండటం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

## ఊరి లక్ష్మమవ్వ ఆలయానికి మంత్రి సోదరుడి విరాళం

- లక్ష రూపాయలు, 50 బస్తాల సిమెంట్ అందజేత



**మక్తల్, ఆగస్టు 03 (జనంసాక్షి):** మక్తల్ మండలం కొత్తగార్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఊరి లక్ష్మమవ్వ ఆలయ నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డా. వాకిటి శ్రీహరి సోదరుడు, మాజీ ఉప సర్పంచ్ వాకిటి శేషగిరి లక్ష రూపాయల ఆర్థిక సహాయంతో పాటు 50 బస్తాల సిమెంటును విరాళంగా అందజేశారు. సోమవారం ఉదయం గ్రామానికి చేరుకున్న ఆయన ఆలయ నిర్మాణ కమిటీ పెద్దలకు నగదు, సిమెంటు బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా వాకిటి శేషగిరి మాట్లాడుతూ, మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఆలయ నిర్మాణానికి ఈ సహాయం అందిస్తున్నామన్నారు. మక్తల్ నియోజకవర్గ వ్యాప్తంగా నూతనంగా నిర్మిస్తున్న అనేక ఆలయాలకు మంత్రి శ్రీహరి ఆర్థికంగా అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అశోక్ గౌడ్, గజ్జెలి అశోక్, అంజి, కురువ గోపాల్, కురువ లక్ష్మన్న, గ్రామ పెద్దలు కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కావలి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కల్లేపల్లి జెడ్పీ పాఠశాలకు మైక్ సెట్ వితరణ



**బెజ్జంకి,ఆగస్టు 3,(జనం సాక్షి):** మండలంలోని కల్లేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు బెజ్జంకి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం లయన్ కచ్చు రాజయ్య సౌజన్యంతో రూ.28 వేల విలువైన మైక్ సెట్‌ను అందజేశారు.పాఠశాలలో మైక్ సెట్ అవసరమని ఆరు నెలల క్రితం కోరగా స్పందించిన రాజయ్య మైక్ సెట్‌ను అందజేశారు.ఈ సందర్భంగా ఆయనకు గ్రామ సర్పంచ్ బిగుల్లా మోహన్, ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు,విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జానకి రాములు, కార్యదర్శి చెన్నాడి సుధాకర్‌రెడ్డి,సభ్యులు,ఎస్ఎంసీ చైర్మన్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని వ్యవసాయ శాఖ అధికారులు



**వెల్దుర్తి, ఆగస్టు 3 (జనంసాక్షి):** వెల్దుర్తి మండల వ్యవసాయ శాఖ అధికారులు సమయపాలన పాటించడం లేదు. సోమవారం 11 దాటిన మండల వ్యవసాయ శాఖ కార్యాలయం తెరుచుకోకపోవడంతో రైతులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. వ్యవసాయసాగు సీజన్ కావడంతో రైతులు యూరియా బుకింగ్ ఇతర పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చారు. ఉదయం10 గంటలకు కార్యాలయానికి వచ్చినరైతులు అధికారులు సమయపాలన పాలించక పోవడం తాళం వేసి ఉండడంతో కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. సీజన్లో అయిన అధికారులు కార్యాలయంలో అందుబాటులోఉండకపోవడం పట్ల అధికారుల తీరుపై రైతులు ప్రభు,సత్యనారాయణ చంద్రయ్యలు మండిపడ్డారు. ఇప్పటికైన వ్యవసాయ శాఖ అధికారులు విధులు నిర్లక్ష్యన్ని విడి రైతులకు అందుబాటులో ఉండి వ్యవసాయ సాగులో రైతులకు సూచనలు సలహాలు, సమస్యలు తీర్చాలని రైతులు కోరుతున్నారు.

## జిల్లావ్యాప్తంగా ఆషాడ బోనాల ఉత్సవాలు..



**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 03(జనం సాక్షి):** ఆషాడ మాసం సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాలలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సంగారెడ్డి పట్టణంలోని వివిధ వార్డులో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లాలోని సదాశివపేట, రాయికోడ్, కొండాపూర్, వట్టిపల్లి, జోగిపేట్, మునిపల్లి, కంది తదితర పట్టణ మండల కేంద్రాలలో మైసమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, దుర్గమ్మ తదితర అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఉత్సవాల సందర్భంగా అడుగడుగునా బోనాలతో పాటు పోతురాజుల విన్యాసాలు శివసత్తుల పూనకాలతో పాటు స్థానికుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. సంగారెడ్డి చెందిన పోట్లవతిని కుటుంబ సభ్యులు స్రవంతి– రాఘవేంద్ర, రాణి, విజయలక్ష్మి, అమ్ముడు అమ్మవారి ఆలయం వరకు బోనాలతో వెళ్లి సమర్పించారు.

## దోసపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా..

- మనూరు మండల సర్పంచ్ల పోరం అధ్యక్షుడు దత్తు..



**మనూరు, ఆగస్టు03 (జనంసాక్షి):**
దోసపల్లి గ్రామాన్ని నియోజకవర్గంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని దోసపల్లి గ్రామ సర్పంచ్ "మనూర్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బిరాదర్ దత్తు అన్నారు.సోమవారం మనూరు మండల పరిధిలోని దోసపల్లిలో శివాలయం ఆవరణలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించి సిసి రోడ్ పనులను ప్రారంభించారు.

ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ దత్తు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు సహకరిస్తే గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి నియోజకవర్గంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.పార్టీలకతంగా గ్రామ అభివృద్ధి కోసం ప్రతిఒక్కరు తోడ్పాటును అందించాలని పేర్కొన్నారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సహకారంతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు నిర్వహిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పీఆర్ఏఈ రజనీకాంత్, పంచాయతీ కార్యదర్శి బాలు,లింగం పటేల్, బసన్న, నారాయణ, అశోక్ డీలర్, సత్యనారాయణ,ఈరన్న, గ్రామస్తులు తధితరులు పాల్గొన్నారు.